ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 69

ఆదివారం 11 ఆగస్టు 2024 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## 10 గంటలు 4.6 కిలోలు

'ఆపరేషన్ వెయిట్ లాస్'

పతక పోరుకు ముందు బరువు తగ్గిన అమన్



7

# వయనాడ్ బాధితులకు అండ



క్షతగాత్రులకు మోడీ పరామర్శ

ఏరియల్ సర్వే ద్వారా విలయ ప్రాంత వీక్షణం

సింఎం పినరయ్‌తో కలిసి సమీక్ష

అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రధాని హామీ



తిరువనంతపురం,ఆగస్ట్10 : కేరళలో ప్రకృతి ప్రకోపానికి బలైన వయనాడ్ బాధితులకు అండగా ఉంటామని ప్రధాని మోడీ ప్రకటించారు. వారికి తగి సహాయం అందిస్తామని అన్నారు. వయనాడ్ విలయ ప్రాంతంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించారు. భారీ వర్షాలు, వరదలతో కొండచరియలు విరిగిపడిన ఘటనలో బాధితులు, ప్రాణాలతో బయటపడిన వారిని మోదీ పరామర్శించారు. అనంతరం కేరళ సీఎం పినరయి

మిగతా 2 లో



## త్వరలోనే తెల్ల రేషన్ కార్డుల జారీ

మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

విధివిధానాలపై కసరత్తు

హైదరాబాద్,ఆగస్ట్ 10 : ఏళ్లుగా తెల్ల రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రేషన్ కార్డుల జారీ పక్రియను వేగవంతం చేసింది. అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ దిశగా అడుగులు వేస్తోంది. తాజాగా ఇదే అంశంపై రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ భేటీ అయ్యింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షత జరిగిన

మిగతా 2 లో

# సుంకిశాలపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరగాలి

## రక్షణ గోడ ఎందుకు కూలిందో తేల్చాలి..

ఇళ్ల కోసం ప్రతిపాదనలను రాష్ట్రం పంపలేదు

డిప్యూటీ సీఎంతో మాట్లాడాను..

ఆలస్యమైనా అనుమతి ఇవ్వాలని ప్రధానిని కోరా

వర్గీకరణపై సుప్రీం ఆదేశాలివ్వలేదు..

ఆలోచించమని చెప్పింది: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సుంకిశాల ప్రాజెక్టు ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరగాలని, ప్రాజెక్టులోని రక్షణ గోడ ఎందుకు కూలిందో, లోపం ఎక్కడ జరిగిందో తేల్చాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు 'ఏక్ పేడ్ మాకే నామ్'లో భాగంగా శనివారం ఢిల్లీలోని తన నివాసంలో మాతృమూర్తి పేరిట కిషన్ రెడ్డి ఒక మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జీవితంలో అమ్మ తర్వాతే అన్నీ అని, కాబట్టి అమ్మకు గుర్తుగా ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు.

న్యూఢిల్లీ, ఆగస్టు 10 : అమ్మ మనల్ని పెంచి పెద్దచేసినట్టే మనం కూడా మొక్కను అంతే జాగ్రత్తగా పెంచి పెద్దది చేయాలన్నారు. రోజురోజుకూ ప్రకృతి వైపరీత్యాలు పెరిగిపోతున్నాయని, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అడవులు తగ్గిపోతున్న తరుణంలో భవిష్యత్తు పెను సవాల్‌గా మారుతోందన్నారు. ఆ తర్వాత విలేకరులు అడిగిన

మిగతా 2 లో



## ప్రాజెక్టులు నిండుకోవడంతో ప్రభుత్వం అప్రమత్తం

అన్నింటా జల విద్యుత్ ఉత్పత్తిని పెంచండి

అధికారులతో డిప్యూటి సిఎం భట్టి సమీక్ష

హైదరాబాద్,ఆగస్ట్ 10 : జల విద్యుత్ కేంద్రాల్లో గరిష్ఠ విద్యుత్ ఉత్పత్తికి చీఫ్ ఇంజినీర్లు చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాలతోపాటు పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నందున వీలైనంత ఎక్కువ ఉత్పత్తిపై థర్మల్, హైడల్ ప్రాజెక్టుల సీఈలు దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన థర్మల్, హైడల్ విద్యుత్ ఉత్పాదకతకు సంబంధించి మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఆ శాఖల సీఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. థర్మల్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిప్లాంట్‌లో

మిగతా 2 లో



## తులం బంగారం కాదు..ఉన్న లక్ష కూడా లేదు

కుక్క కాటు బాధితులను ఆదుకోవాలి

హైకోర్టు హెచ్చరించినా చలనం లేదు

సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

సిద్దిపేట,ఆగస్ట్10 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎగవేత, కోతల ప్రభుత్వమని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. పింఛన్ పెంపు, రైతుబంధు, తులం బంగారం.. మాటలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో ఆయన సీఎంఆర్‌ఎఫ్

మిగతా 2 లో

# కేటీఆర్ జైలు కెళ్లడం ఖాయం

ఆ పని రేవంత్ చూసుకుంటారు

బీఆర్ఎస్, బీజేపీ విలీనం అంతా ట్రాష్

బీఆర్ఎస్ ఔట్‌డేటెడ్ పార్టీ అన్న బండి

హైదరాబాద్,ఆగస్ట్ 10 : మాజీ మంత్రి కేటీఆర్‌కు జైలు తప్పదని, ఆయన చేసిన అరాచకాలు, అవినీతి అందరికీ తెలుసునని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ విలీనం వార్తలను ఆయన కొట్టి పారేశారు. బిఆర్ఎస్ పని అయిపోయిందని అన్నారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. కేటీఆర్ ను జైలుకు పంపే పనిని సీఎం రేవంత్ రెడ్డి చూసుకుంటారని చెప్పారు. తనతోపాటు ఎందరో బీజేపీ కార్యకర్తలను నాయకులను కేటీఆర్ జైల్లో వేసి హింసించారని దానిని తానింకా మర్చిపోలేదని అన్నారు. బీఆర్ఎస్ బీజేపీతో చర్చలు జరిపినట్టు వస్తున్నవి ఫేక్ న్యూస్ అని అన్నారు. బీఆర్ఎస్ ఓ ఔట్ డేటెడ్ పార్టీఅని అన్నారు. కవిత బెయిల్ కు బీజేపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. సిసోడియాకు బెయిల్ వస్తే బీజేపీకి ఏమైనా సంబంధం ఉందా..? అంటూ ప్రశ్నించారు. కోర్టు అంశాలను పార్టీతో ముడిపెట్టడం

మిగతా 2 లో



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం
11 ఆగస్టు
2024




# సుంకిశాలపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరగాలి

## మొదటి పేజీ తరువాయి

పలు ప్రశ్నలకు కేంద్ర మంత్రి సమాధానాలు చెప్పారు. 'అప్పుడున్న పరిస్థితుల్లో సామాజిక అసమానతలను దృష్టిలో పెట్టుకుని దళిత వర్గానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రిజర్వేషన్లు తీసుకొచ్చారు. అంతేతప్ప ఆర్థిక అసమానతల కారణంగా రిజర్వేషన్లు ఇవ్వలేదు. దేశంలో నేటికీ దళితులపై సామాజిక వివక్ష కొనసాగుతూనే ఉంది. అయినా ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఆలోచించమని మాత్రమే చెప్పింది తప్ప ఆదేశాలేమీ ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ క్రీమీలేయర్ విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడున్న విధానమే కొనసాగుతుంద'ని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర కట్టుబడి ఉందన్నారు. 'దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో కేంద్రం ఇళ్లు మంజూరు చేసింది. కానీ గత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోలేదు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు అవుతోంది. కానీ నేటికీ కేంద్రానికి ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదు. నిన్నే ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి శ్రీనివాసరెడ్డితో మాట్లాడాను. ఇళ్లకు సంబంధించి తెలంగాణ నుంచి ప్రతిపాదనలు రాలేదని, వెంటనే పంపించాలని సూచించాను. నిన్నటి కేంద్ర క్యాబినెట్ సమావేశంలోనూ ప్రధానికి విషయం చెప్పాను. తెలంగాణ నుంచి ప్రతిపాదనలు కాస్త అలస్యంగా వచ్చినా అనుమతి ఇవ్వాలని కోరాను. ఆయన తప్పకుండా అనుమతి ఇస్తామని హామీ ఇచ్చార'ని కిషన్ రెడ్డి తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పు విషయం అధిష్ఠానం చూసుకుంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పునకు సంబంధం లేదన్నారు. బీఆర్ఎస్ విలీనం వార్తలను మీడియాలోనే చూశానని, ఇప్పటివరకు అటువంటి చర్చలేమీ జరగలేదన్నారు.

**ఒడిశా, ఏపీ, తెలంగాణ.. అనుసంధానం**
**కొత్త లైన్ పూర్తయితే భద్రాచలం మీదుగా రైలు**
**ప్రత్యామ్నాయ సరుకు రవాణా కారిడార్‌కు బాటలు**
**173 కిలోమీటర్లు.. అంచనా వ్యయం రూ.4,109 కోట్లు**
**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి.. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు**
**కొత్త రైల్వే ప్రాజెక్టుతో తెలుగు రాష్ట్రాలకు ఎంతో మేలు**
**విశాఖ జోన్‌పై ఏపీ సీఎంతో చర్చిస్తున్నాం: అశ్వినీ వైష్ణవ్**

కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన మల్కన్‌గిరి–పాండురంగాపురం రైల్వే లైన్‌తో ఒడిశా, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు అనుసంధానం కానున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. భద్రాచలం మీదుగా రైళ్లు నడవడమే కాకుండా, ప్రత్యామ్నాయ సరుకు రవాణా కారిడార్‌గా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మొత్తం 173.6 కిలోమీటర్ల మేర నిర్మించనున్న రైల్వే లైన్‌కు రూ.4,109 కోట్ల మేర ఖర్చయ్యే అవకాశం ఉందని వివరించారు. భద్రాచలం మీదుగా రైల్వే లైన్ కలను ప్రధాని మోదీకి ధన్యవాదాలు చెబుతున్నట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత ప్రతిపాదించిన మల్కన్‌గిరి–భద్రాచలం రైల్వే లైన్ పొడవు 147.5 కిలోమీటర్లు కాగా, దాన్ని మరో 26.1 కిలోమీటర్లు పెంచి పాండురంగాపురం వరకు పొడిగించామని తెలిపారు. తద్వారా ఈ లైన్‌ను మెయిన్ రైల్ లైన్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసేందుకు అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. జునాగఢ్(ఒడిశా) – మల్కన్‌గిరి మధ్య చేపట్టిన రైల్వే లైన్ ఇప్పటికే నిర్మాణంలో ఉన్నదని, ఇప్పుడు కొత్తగా ప్రతిపాదించిన మల్కన్‌గిరి–పాండురరంగాపురం రైల్వే లైన్ పూర్తయితే ప్రత్యామ్నాయ సరుకు రవాణా కారిడార్‌కు బాటలు పడతాయని తెలిపారు.

ఈ ప్రాజెక్టుతో తెలంగాణ, ఛత్తీసగఢ్, ఒడిశా రాష్ట్రాల మధ్య ప్రజల రాకపోకలు పెరుగుతాయని, వ్యవసాయం, వాణిజ్యం, విద్య, పర్యాటకం, ఆరోగ్య సంరక్షణ వంటి అనేక రంగాల్లో వృద్ధి సాధించడానికి దోహదపడుతుందని చెప్పారు. ఒడిశా, ఛత్తీసగఢ్ రాష్ట్రాల్లోని అల్యూమినియం, స్టీల్ ఫ్యాక్టరీల ఉత్పత్తులను ఏపీలోని పోర్టులకు తరలించడానికి మార్గం సుగమమవుతుందని తెలిపారు. ఏపీలోని కృష్ణపట్నం, మచిలీపట్నం పోర్టులతోపాటు నూతనంగా నిర్మిస్తున్న రామాయపట్నం పోర్టు నుంచీ సరకు రవాణాను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని వివరించారు. ఒడిశా నుంచి హైదరాబాద్, విజయవాడకు నేరుగా కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న నేషనల్ వాటర్ వే-5తో భవిష్యత్తులో ఈ రైల్వే ప్రాజెక్టును అనుసంధానించి మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్‌ను అభివృద్ధి చేసే అవకాశం ఉందని వెల్లడించారు.

# మల్లారెడ్డి కాలేజీలో విద్యార్థుల ఆందోళన

## విద్యార్థి మృతికి పరిహారం కోసం డిమాండ్

హైదరాబాద్,ఆగస్ట్ 10 : మైసమ్మగూడలోని మల్లారెడ్డి అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాలలో గుండెపోటుతో మృతి చెందిన బీటెక్ ఫస్టియర్ విద్యార్థికి న్యాయం చేయాలని, కళాశాలలో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. వందలాది మంది విద్యార్థులు కళాశాల ఎదుట ఆందోళన దిగారు. మాజీ మంత్రి మల్లారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. సోఫాకు నిప్పంటించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దాదాపు మూడు నుంచి నాలుగు గంటల వరకు కళాశాల ముందు ఆందోళన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనకు ఏబీవీపీ, ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘాలు మద్దతు తెలపడంతో ఆందోళన తారాస్థాయికి చేరింది. మల్లారెడ్డికి వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. పోలీసులు జోక్యం చేసుకున్నప్ప టికీ విద్యార్థులు ఎక్కడ తగ్గలేదు. చివరకు మల్లారెడ్డి కొడుకు మహేందర్ రెడ్డి, కోడలు ప్రీతిరెడ్డి దిగివచ్చి పరిస్థితిని శాంతింప చేశారు. విద్యార్థుల సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని, గుండెపోటుతో మృతి చెందిన అరుణ్ కుమార్ అనే విద్యార్థికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో చివరకు విద్యార్థులు శాంతి ఇచ్చారు. అగ్రికల్చర్ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం చదువుతున్న అరుణ్‌కుమార్ అనే విద్యార్థి తరగతి గదిలో ఉండగా గుండెపోటుతో మృతి చెందాడు. విద్యార్థి మృతికి కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటూ విద్యార్థి సంఘాలు, విద్యార్థులు ఆరోపణలు చేస్తున్నారు. సకాలంలో అంబులెన్స్‌ను ఏర్పాటు చేయకపోవడం వల్ల విద్యార్థి మృతి చెందాడని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. అంబులెన్స్ ఏర్పాటు చేయాలని విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలంటూ ఆందోళన చేపట్టారు. విద్యార్థుల డిమాండ్లన్నీ పరిష్కరిస్తామని, ముఖ్యంగా అన్ని క్యాంపస్లకు అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తామని మల్లారెడ్డి విద్యా సంస్థల డైరెక్టర్ ప్రీతి రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులకు హెల్త్ చెకప్ క్యాంపులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# అంటువ్యాధులకు తోడు జ్వరాలు

## భయంతో ఆస్పత్రులకు పరుగు

విజయవాడ,ఆగస్ట్ 10 : వర్షాలు తగ్గి వరద నుంచి కోలుకుంటున్న ప్రజలకు అంటువ్యాధులు తప్పడం లేదు. దీనికితోడు ఇప్పుడు ఎక్కడ చూసినా ప్రజల జ్వరాలతో బాధపడుతున్నారు. సామాన్య జ్వరాలా లేక డెంగ్యూ లాంటి జ్వారాలో అర్థం కాక హైరానా పడుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు జ్వరపీడితులు ఎక్కువయ్యారు. వైరల్ ఫీవర్‌తో పాటు కీళ్ల నొప్పులతో అస్పత్రలు చుట్టూ తిరుగుతున్నారు. నిన్నటి వరకు వర్షాలు, వరదలతో ఉక్కిరిబిక్కిరైన జనం ప్రస్తుతం వైరల్ జ్వరాలతో తల్లడిల్లుతున్నారు. గత కొద్దిరోజుల నుంచి అనేక గ్రామాల్లో దగ్గు, జలుబులు తీవ్రరూపం దాల్చడమే కాకుండా చాలా మంది జ్వరాల బారిన పడుతున్నారు. అధికారులు వైరల్ ఫీవర్‌లుగా అధికారికంగా పేర్కొంటున్నప్పటికీ లక్షణాలు మాత్రం మలేరియా, టైఫాయిడ్‌లను పోలినట్లుగానే ఉంటున్నాయి. జ్వరాలు జనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. జ్వరాల తీవ్రత పెరుగుతుండడంతో వైద్య,ఆరోగ్యశాఖ అప్రమత్తమై మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసింది. వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నప్పటికి పారిశుధ్య సమస్య కారణంగా వైరల్ జ్వరాలు విభృంభిస్తున్నాయంటున్నారు. వాతావరణం లో వేడితీవ్రత తగ్గకపోవడం అలాగే వర్షాల కారణంగా నీరు నిలిచి ఉంటున్నందున ఈగలు, దోమలు వృద్ధి చెందిన వైరల్ జ్వరాలతో పాటు డయేరియా లాంటి రోగాలు విస్తరిస్తున్నాయంటున్నారు. అలాగే జ్వరాలకు తోడుగా దగ్గు, జలుబు కూడా సాధారణ ప్రజానీకాన్ని సతమతం చేస్తోంది. కొన్ని రోజుల నుంచి ఓ వైపు జ్వరాలు, మరోవైపు డయేరియా, దగ్గు, జలుబు లాంటివి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుండడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు జ్వర బాధితులు క్యూ కడుతున్నారు. వైద్య,ఆరోగ్యశాఖ రక్త పరీక్షల నమూనా శిబిరాలను సైతం చేపట్టింది. చాలా ప్రైవేటు ఆసుపత్రులు జ్వర బాధితులతో కిటకిటలాడు తున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల ల్యాబోరేటరీల్లో మాత్రం టైఫాయిడ్, మలేరియాలు కూడా నిర్ధారణ అవుతున్నట్లు చెబుతున్నారు.

# ఏపిలో రెడ్‌బుక్ రాజ్యమేలుతోంది

## హామీలకు నాది గ్యారెంటీ అని దగా

## అబద్ధపు లెక్కలు..శ్వేత పత్రాలతో మోసం

## ట్విట్టర్ వేదికగా మండిపడ్డ జగన్

అమరావతి,ఆగస్ట్10 : ఏపీలో రెడ్‌బుక్ రాజ్యమేలుతోందన్నారు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తానని.. హామీలను నాది గ్యారంటీ అని చంద్రబాబు పదే పదే చెప్పారు. ఇప్పుడు హామీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది పచ్చిమోసం కాదా చంద్రబాబు? అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. అలాగే, అబద్ధపు లెక్కలతో, తప్పుడు శ్వేతపత్రాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా..'చంద్రబాబు.. ఎన్నికలప్పుడు ఈ రాష్ట్రం బాధ్యత నాది అన్నారు. పైపెచ్చు రాష్ట్రానికి రూ.14లక్షల కోట్ల అప్పులున్నాయని, అయినా సంపద సృష్టిస్తానని, హామీలకు గ్యారెంటీ నాదే అని పదే పదే చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక రాష్ట్రం బాధ్యత ప్రజల దంటూ నైజాన్ని బయటపెట్టారు. ఇచ్చిన హామీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది పచ్చి మోసం కాదా? చంద్రబాబూ? ప్రమాణస్వీకారం చేసిన తొలి క్షణంనుంచే మీరు ప్లేటు ఫిరాయించారు. ఖజానా ఖాళీ అయిపోయిందంటూ తప్పుడు శ్వేతపత్రాలు జారీచేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. అప్పులకు వడ్డీలు కట్టాలి, అవి కట్టడానికే డబ్బుల్లేవు అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతూ లేని అప్పులు ఉన్నట్టుగా, వాటికి లేని వడ్డీలు కడుతున్నట్టుగా పదే పదే మాట్లాడి ప్రజలను మాయచేసే ప్రయత్నం చేస్తున్నారు. తల్లికి వందనం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇవ్వలేదు, రైతు భరోసా కింద ప్రతి రైతుకు రావాల్సిన రూ.20వేలు రాలేదు, ఫీజు రియింబర్స్‌మెంట్ కింద రెండు త్రైమాసికాల డబ్బులు పెండింగ్, వసతి దీవెనా లేదు, సున్నా వడ్డీ లేనే లేదు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అక్క చెల్లెమ్మకూడా నెల రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18వేలు జాడే లేదు. ప్రతి ఇంటికీ ఉద్యోగం లేదా రూ. 3వేల నిరుద్యోగ భృతి ఊసే లేదు. చివరకు రూ.20వేలు ఇస్తానన్న మత్స్యకార భరోసా అడ్రస్సే లేదు. పేదలకు అత్యవసరమైన ఆరోగ్యశ్రీ చెల్లింపులు రూ.1600 కోట్లు పెండింగ్. ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చే విధానం ఆగిపోయింది.

ఇంటికి వచ్చే రేషన్ నిలిచిపోయింది. వాలంటీర్లను మోసం చేశారు, విత్తనాలకోసం రైతులు క్యూలో నిలబడే పరిస్థితిని తీసుకువచ్చారు. పంటలకు ఉచిత బీమా ఎగరగొట్టారు. బడుల్లో టోఫెల్ పీరియడ్ రద్దుచేశారు. విద్యా కానుక కిట్లు పంపిణీ అరకొరగానే, అదికూడా అస్తవ్యస్తం. మధ్యాహ్న భోజనం పథకంలో రోజుకో మెనూ పద్ధతి పోయింది. ఇంగ్లిషు మీడియం గాడితప్పింది, బడుల్లో, గ్రామాల్లో పరిశుభ్రత పడకేసింది. లా అండర్ ఆర్డర్ పూర్తిగా గాడితప్పింది. రెడ్‌బుక్ రాజ్యమేలుతోంది. రాష్ట్రం మూడు హత్యలు, ఆరు విధ్వంసాలుగా వర్ధిల్లుతోంది. మహిళలకు రక్షణే లేదు. దిశయాప్ అటకెక్కింది. రెండున్నర నెలల్లోనే ప్రజలను ఇంతలా దగా చేస్తారా చంద్రబాబూ?. ఎన్నికలకు ముందు రూ.14 లక్షల కోట్ల మేర రాష్ట్రం అప్పులపాలైందని, శ్రీలంక అయిపోయిందని, ఆర్థిక విధ్వంసం జరిగిందని మీరు ఊరూరా విష ప్రచారం చేశారు. అయినా సరే అపార అనుభవం ఉంది, నన్ను మించినవారు లేరు, అమలు చేసే బాధ్యత నాదీ అని, సూపర్ సిక్స్ అంటూ సూపర్ టెన్ అంటూ చాలా చాలా వాగ్దానాలు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అప్పులు రూ.10 లక్షల కోట్లు అంటున్నారు. అదికూడా అసత్యమే అయినా సాక్షాత్తూ గవర్నర్‌గారితో అసెంబ్లీలో ఇలాంటి అనేక అవాస్తవాలను చెప్పించారు. నిజాలు ఏంటంటే.. రాష్ట్ర ప్రభుత్వం రుణాలు, విద్యుత్ కంపెనీల రుణాలతో కలిపి, గ్యారంటీ రుణాలు, నాన్ గ్యారంటీ రుణాలు ఇవన్నీ జూన్ 2024నాటికి ఉన్న మొత్తం అప్పులు అక్షరాల రూ.7,48,612కోట్లు. ఇందులో 2019లో మీరు దిగిపోయేనాటికి ఉన్న అప్పులు రూ.4,08,170 కోట్లు. దీనికిపైన ఉన్నవి మాత్రమే మా హయంలో చేసిన అప్పులు. మీ హయాంలో అప్పుల వృద్ధిరేటు (సీఏజీఆర్) 21.63శాతం అయితే, కోవిడ్ కారణంగా ఆర్థిక వ్యవస్థలో మహా సంక్షోభం వచ్చినా, మా హయాంలో అది కేవలం 12.9 శాతం. ఈ వాస్తవాలన్నింటినీ కూడా గవర్నర్‌గారికి లేఖ రూపంలో తెలియజేశాం. అందులో కేంద్ర ప్రభుత్వ ప్రకటనలు, ఆర్బీఐ నివేదికలు, కాగ్ లెక్కలలాంటి ఆధారాలతో కూడిన సమగ్ర వివరాలు ఉన్నాయి. జాగ్రత్తగా చదువుకోండి చంద్రబాబు. ఇకనైనా రాష్ట్రంలో హత్యలు, విధ్వంసాలను ఆపేసి, అబద్ధపు లెక్కలతో ప్రజలను మోసం చేయడం మాని, సూపర్ సిక్స్ సహా ఇచ్చిన హామీలను తూ.చా తప్పక అమలు చేయండి. ఇప్పటికే దిగజారిన పాలనను గాడిలో పెట్టండి' అంటూ హితవు పలికారు.

# తులం బంగారం కాదు..ఉన్న లక్ష కూడా లేదు

## మొదటి పేజీ తరువాయి

చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పింఛన్ పెంపు దేవుడెరుగు, 2 నెలల నుంచి ఉన్న పింఛనే రావట్లేదని ఆరోపించారు. "తులం బంగారం దేవుడెరుగు. కేసీఆర్ ఇచ్చిన రూ.లక్ష కూడా ఎగ్గొట్టారు. అబద్ధాలు, మాయ మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. గ్రామాల్లో చెత్త పేరుకుపోతోంది. ట్రాక్టర్ డీజిల్‌కు కూడా డబ్బుల్లేవు. మధ్యాహ్న భోజనం కార్మికులకు 8 నెలలుగా జీతాలు లేవు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లలో పని చేసే కార్మికులకు జీతాల్లేవు. గ్రామాల్లో కుక్కలు, వసతి గృహాల్లో ఎలుకలు దాడి చేస్తున్నాయి" అని హరీశ్‌రావు అన్నారు. ఇదిలావుంటే రాష్ట్రంలో వీధి కుక్కల దాడులు విపరీతంగా పెరిగిపోతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోకపోవడం అత్యంత దారుణం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వీధి కుక్కల దాడులపై పలుమార్లు హైకోర్టు హెచ్చరించినా కాంగ్రెస్ సర్కార్ మొద్దు నిద్ర వీడట్లేదని మండిపడ్డారు. నిన్న ఒక్కరోజే వరంగల్ ఎంజిఎం ఆస్పత్రిలో పసికందు మృతదేహాన్ని కుక్కలు పీక్కతినడం, హైదరాబాద్ శివారులోని నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలో మరో దివ్యాంగ చిన్నారి మర్మాంగాలపై కుక్కల దాడి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో నాలుగేళ్ల చిన్నారి కుక్కల దాడిలో గాయాలపై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి.. వంటి హృదయవిధారక ఘటనలు జరగటాన్ని చూసి కూడా ప్రభుత్వం చలించకపోవడం అమానవీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.బతికున్న మనుషులను సైతం కుక్కలు చంపి పీక్కుతిన్న



సంఘటనలు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. మరోవైపు చిన్నారులపై కుక్కల దాడులు నిత్యకృత్యం అవుతున్నాయి. రాష్ట్రంలో కుక్కల దాడుల్లో మనుషులు చనిపోవడం అనేది ఒక సాధారణ అంశంగా ప్రభుత్వం భావిస్తుండటం దుర్మార్గం. కుక్క కాటు కేసులు నమోదైన మొదట్లోనే తగిన చర్యలు తీసుకొని ఉంటే గడిచిన ఎనిమిది నెలల కాలంలో 343 కుక్కకాటు సంఘటనలు జరిగి ఉండేవి కావు. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయేవారు కాదు. రాష్ట్రంలో 3,79,156 వీధి కుక్కలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల హైకోర్టుకు తెలిపింది. కానీ వీటి సంఖ్య ఇంతకు రెట్టింపు ఉంటుంది అని ప్రజలు భావిస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలు నిలిపివేయడం వల్ల పారిశుధ్య నిర్వహణ పడకేసిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. చెత్తాచెదారం పేరుకుపోయిన ప్రాంతాల్లో వీధికుక్కల బెడద మరింత ఎక్కువైంది. మున్సిపల్ టౌన్లలో పురపాలక శాఖ వైఫల్యం వల్ల వీధి కుక్కల నియంత్రణ లేకుండా పోయింది. అంతే కాక సరైన నిధుల కేటాయింపు లేక కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేసే వ్యవస్థ కూడా అసలు సరిగా పనిచేయడం లేదు. దీనివల్ల వీధి కుక్కల సంతానం విపరీతంగా పెరిగిపోయింది. ఇప్పటికే పలుమార్లు హైకోర్టు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేసినా ప్రభుత్వం మాత్రం మొద్దు నిద్ర వదలడం లేదు అని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే కుక్కకాటు దాడులు అరికట్టే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలి. ఇప్పటివరకు జరిగిన కుక్కకాటు ఘటనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ప్రాణాలు కోల్పోయిన వారికి, గాయపడిన వారికి నష్టపరిహారం చెల్లించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా కుక్కకాటు బాధితులకు తక్షణ వైద్యం అందేలా చూడాలి, యాంటీ రేబీస్ మందులు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాలి. దీంతోపాటు వీధి కుక్కల నియంత్రణ కోసం సమగ్ర కార్యాచరణ అమలు చేయాలి. క్రమం తప్పకుండా మానిటర్ చేస్తూ సంఖ్య పెరగకుండా చూసుకోవాలని హరీశ్‌రావు సూచించారు.స్త్ర

# వయనాడ్ బాధితులకు అండ

## మొదటి పేజీ తరువాయి

విజయన్, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, కేంద్రమంత్రి సురేష్ గోపి, ఇతర యవనాడ్ ఉన్నతాధికారులతో ప్రధాని సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. వయనాడ్‌లో కొండచరియలు విగిరిపడినప్పటి నుంచి ఘటనకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఈ విపత్తులో వందలమంది తమ సర్వస్వాన్ని కోల్పోయారని అన్నారు. ప్రకృతి విలయంలో వాళ్ల కలలన్నీ కల్లలైపోయాయని అన్నారు. ఈ దుఃఖ సమయంలో మీకు అండగా ఉంటామని బాధితులకు చెప్పినట్లు తెలిపారు. 'ఈ రోజు నేను రిలీఫ్ క్యాంపులో బాధితులను స్వయంగా కలిశాను. గాయపడిన వారిని ఆసుపత్రిలో పరామర్శించాను. వారు చాలా కష్ట పరిస్థితిలో ఉన్నారు. వయనాడ్ విలయంలో చిక్కుకున్న వారికి అండగా నిలవాలి. అంతా కలిసి పనిచేస్తేనే బాధితులకు అ అండ దక్కగలదు. ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు అంతా కలిసి పనిచేయాలి. ఆప్తులను కోల్పోయిన వారికి అండగా నిలుద్దాం. రాష్ట్ర ప్రభుత్వం నష్టం అంచనాలు పంపిన వెంటనే ప్రకృతి విపత్తు సాయం అందిస్తాం అన్నారు. సంఘటన జరిగిన రోజు ఉదయం నేను సిఎం పినరయి విజయన్‌తో మాట్లాడాను. మేము సహాయం అందజేస్తామని, వీలైనంత త్వరగా సంఘటనా స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చాను. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్. సైన్యం, పోలీసులు, వైద్యులు, ప్రతి ఒక్కరూ బాధితులకు వీలైనంత త్వరగా సహాయం చేయడానికి ప్రయత్నించారు. మృతుల కుటుంబీకులు ఒంటరిగా లేరని నేను హామీ ఇస్తున్నాను. వారికి మేము అండగా ఉన్నాం. కేరళ ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వం వారికి సాయం చేస్తోందని తెలిపారు. వయనాడ్ కొండచరియల ప్రకృతి విపత్తును ప్రధాని మోదీ శనివారం హెలికాప్టర్ ద్వారా వీక్షించారు. ఢిల్లీ నుంచి విమానంలో కేరళకు బయలుదేరిన ప్రధాని.. ఉదయం 11 గంటలకు కన్నూర్ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్నారు. ఆయన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ రిసీవ్ చేసుకున్నారు. అక్కడ నుంచి ఓ ప్రత్యేక విమానంలో వయనాడ్ బయలుదేరారు. కొండచరియలు సంభవించిన చూరల్ మలా, మండక్కై ప్రాంతాలలో ఏరియల్ సర్వే నిర్వహించారు. రెస్క్యూ ఆపరేషన్, సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల గురించి అధికారులను ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులను కలుసుకోని మాట్లాడారు. వయనాడ్ ప్రాంతంలో ప్రకృతి విళయ తాండవం వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించారు. అధికారులతో కేంద్ర సహాయం గురించి చర్చించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను కలుసుకున్నారు. తర్వాత ప్రాణాలతో బయటపడిన వారిని కలిసి కొండచరియల విధ్వంసం గురించి తెలుసుకోనున్నారు. ఆయనతోపాటు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, ప్రభుత్వ అధికారులు ఉన్నారు.

# ప్రాజెక్టులు నిండుకోవండతో ప్రభుత్వం అప్రమత్తం

## మొదటి పేజీ తరువాయి

కనీసం 17రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలు తీర్చేందుకు నిబద్ధతతో పని చేయాలని స్పష్టం చేశారు. పనిలో నిర్లక్ష్యం, అలసత్వాకి తావు లేదని హెచ్చరించారు. విద్యుత్ శాఖ అంటేనే ప్రజల కోసం నిరంతరం పనిచేసే శాఖ అని చెప్పుకొచ్చారు. 24/7 పని చేయాల్సిన అత్యవసర శాఖ అనే విషయాన్ని అధికారులు, సిబ్బంది గుర్తుపెట్టుకోవాలని హితవుపలికారు. విద్యుత్ ఉత్పత్తిలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు అనుగుణంగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని భట్టి విక్రమార్క అధికారులకు చెప్పారు. సకాలంలో నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లే గతంలో శ్రీశైలం, జూరాల వంటి హైడల్ విద్యుత్ ప్రాజెక్టుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, తద్వారా ఏర్పడిన నష్టం గురించి అధికారులకు వివరించారు. ఇకపై నిర్ణయాలు తీసుకోవడంలో అలాంటి పరిస్థితి పునరావృతం కాకూడదని చెప్పారు. ఇందుకుగాను వారానికి ఒకసారి విద్యుత్ కేంద్రాల పరిస్థితి, ఉత్పాదకతకు సంబంధించిన నివేదికలు తనకు పంపాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యుత్ శాఖలో పని చేసే ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వినేందుకు, పరిష్కరించేందుకు తాను 24గంటలూ అందుబాటులో ఉంటానని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. ఒకవేళ తాను అందుబాటులో లేకుంటే సమస్యలను విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రాజెక్టులకు సంబంధించి సీఈలు నిర్లక్ష్యం వహించినట్లుగా ఉంటే రాతపూర్వకంగా వారి నుంచి వివరణ తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఉన్నతాధికారు లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్ కో జేఎమ్డీ శ్రీనివాస్, ఎనర్జీ ఓఎస్డీ సురేందర్ రెడ్డి, జెన్కో డైరెక్టర్లు, సీఈలు హాజరయ్యారు.


# త్వరలోనే తెల్ల రేషన్ కార్డుల జారీ

## మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశంలో ఇతర మంత్రులు, సంబంధిత శాఖా అధికారులు హాజరయ్యారు. రేషన్ కార్డుల జారీపై మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం నాడు కొత్త రేషన్ కార్డుల మంజూరీపై సచివాలయంలో జరిగిన మంత్రివర్గ ఉపసంఘం భేటీకి చైర్మన్‌గా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యవహరించారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహ హాజరయ్యారు.తెల్లరేషన్ కార్డుల పంపిణీకి విధివిధానాలపై మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కూడిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై చర్చించింది. రాష్ట్రంలో అర్హులైన ప్రజలందరికీ తెల్ల రేషన్ కార్డు జారీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో వార్షిక ఆదాయం లక్షన్నర, మాగాణి 3.50 ఎకరాలు, చెలక 7.5 ఎకరాలు ప్రామాణికంగా తెల్ల రేషన్ కార్డు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రెండు లక్షలుగా నిర్ణయించారు. పట్టణ ప్రాంతాల్లో భూములను కాకుండా వార్షిక ఆదాయాన్ని ఆధారంగా రేషన్ కార్డు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డుల పంపిణీలో లబ్దిదారుల ఎంపికకు విధి విధానాల రూపకల్పనలో రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయనున్నట్లు మంత్రివర్గ ఉపసంఘం తెలిపింది. లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ, శాసనమండలి సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. వాందరికీ సమాచారం చేరేలా లేఖలు రాయాలని అధికారులను ఆదేశించింది మంత్రివర్గ ఉపసంఘం. తెల్ల రేషన్ కార్డుల జారీ కోసం సక్సేనా కమిటీ సిఫారసుల పరిశీలించడం, దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో తెల్ల రేషన్ కార్డుల అర్హత ప్రమాణాలను పరిశీలించాలను అధికారులను మంత్రులు ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో తెల్ల రేషన్ కార్డు ఉండి తెలంగాణలోనూ వైట్ రేషన్ కార్డు ఉంటే తీసివేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్ష వార్షిక ఆదాయం లేదా మాగాణి 3.50 ఎకరాలు, లేదా చెలక 7.5 ఎకరాల లోపు భూమి ఉన్నవారినే ఎంపిక చేయాలని ప్రతిపాదించారు. పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల గరిష్ట వార్షికాదాయం ఉన్న వారినే అర్హులుగా నిర్ణయించాలని సూచించారు. అన్ని పార్టీలు, ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకోవాలని ఉపసంఘం నిర్ణయించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలకు లేఖలు రాసి సూచనలు తీసుకోవాలని నిర్ణయించింది. రెండు రాష్ట్రాల్లో రేషన్ కార్డులున్న వారికి ఆప్షన్ ఇవ్వాలని ప్రతిపాదించింది. సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సక్సేనా కమిటీ సిఫారసులను రేషన్ కార్డుల మంజూరుకు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రస్తుతం 89.96 లక్షల రేషన్ కార్డులుండగా.. పెండింగులో 10 లక్షల దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు.

# కేటీఆర్ జైలు కెళ్లడం ఖాయం

## మొదటి పేజీ తరువాయి



సరికాదని చెప్పారు. రాష్ట్రంలో నిజాయితీగా పనిచేసే ఐపీఎస్ లకు ఇప్పటికీ పోస్టింగ్ ఇవ్వకపోవడం విడ్డూరమన్నారు. బిఆర్ఎస్ కొమ్ముకాసిన ఐఏఎస్ లకే మళ్లీ పోస్టింగులు ఇస్తునారని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనకు మధ్య పెద్దగా తేడా ఏమీలేదని, అతి తక్కువ టైంలో ప్రజా వ్యతిరేకత చురగొన్న ఏకైక పార్టీ కాంగ్రెస్సేనని బండి సంజయ్ అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని చెప్పారు. మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ, జడ్పీటీసీలే మా బ్రాండ్ అంబాసిడర్లని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడి కోసమే అమెరికా వెళ్లారనటం సరికాదని బండి అన్నారు. రాజకీయాల్లో విమర్శలు చేసేటప్పుడు హుందాగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఇతర పార్టీలను చీల్చి లాభం పొందాలనే ఆలోచన బీజేపీకి లేదన్నారు. కాంగ్రెస్ కు ప్రజలు ఐదేళ్ల తీర్పు ఇచ్చారని, అధికారాన్ని ఉంచుకుంటారా? వదులుకుంటారా? అనేది వాళ్ల పై ఆధారపడి ఉంటుందని అన్నారు. అసదుద్దీన్ ఓ వైసీ ఎన్ని వక్ఫ్ బోర్డు భూములను కాపాడారో చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. గతంలో వక్ఫ్ బోర్డు భూములను కాంగ్రెస్, ఎంఐఎం నేతలు చా లా చోట్ల కబ్జా చేశారని విమర్శించారు. సవరణ బిల్లు ఆమోదం పొందితే అన్ని విషయాలు బయటికి వస్తాయని విరించారు. వక్ఫ్ బోర్డు భూములకు సంబంధించి ఎంత మంది పేద ముస్లింలకు ఇచ్చారో చెప్పగలరా అని ప్రశ్నించారు. వక్ఫ్ బోర్డు భూములను కాంగ్రెస్, ఎంఐఎం నేతలు చాలా చోట్ల కబ్జా చేశారని.. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందితే... వాస్తవాలన్నీ బయటకు వస్తాయన్నారు. బీజేపీ
స్టేట్ చీఫ్ ఎవరనేది జాతీయ అధ్యక్షుడు నడ్డా డిసైడ్ చేస్తారని అన్నారు. అధినాయకత్వం నిర్ణయమే పార్టీకి శిరోధార్యమని చెప్పారు.కాంగ్రెస్‌లో లుకలుకలు మొదలయ్యాయని.. ఇతర పార్టీలను చీల్చి లాభం పొందాలనే ఆలోచన బీజేపీకి లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కు ప్రజలు ఐదేళ్ల తీర్పు ఇచ్చారు.. ఐదేళ్లు అధికారాన్ని ఉంచుకుంటారా? వదులుకుంటారా? అనేది ప్రభుత్వ తీరుపై ఆధారపడి ఉందన్నారు. హైకమాండ్ ఎవర్నిబీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా నియమిస్తే వారి నేతృత్వంలో పని చేస్తామన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 11 ఆగస్టు 2024




# ఘనంగా మాజీ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు..

## రక్తదానం చేసిన అభిమానులు..





భువనగిరి ,ఆగస్టు10(రోమింగ్ న్యూస్) : భువనగిరి ప్రగతి కోసం భావితరాల భవిష్యత్తు కోసం శ్రమించిన నాయకుడు, ప్రజా సేవకుడు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పట్టణ పార్టీ, మండల పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. భువనగిరి పట్టణం లోని స్వయంభు గణపతి గుడి లో పూజలు చేసి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రేడ్, పండ్ల పంపిణీ కార్యక్రమం చేశారు. అనంతరం బాబు జగ్జీవన్ రావు చౌరస్తాలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 100 మంది రక్తదానం చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్, మాజీ జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ కొలుపుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఓం ప్రకాష్, మజీ జడ్పీటీసీ బీరు మల్లయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు ఖాజా అజీముద్దీన్, దొడ్డికాడి భగత్, పంగరెక్క స్వామి, నాయకులు ఇట్టబోయిన గోపాల్, అతికం లక్ష్మీనారాయణ గౌడ్, ఎడ్ల సత్తి రెడ్డి, సురపల్లి రమేష్, కంచి మల్లయ్య, తుమ్మల పాండు, ఏక్బాల్ చౌదరి, వెల్దుర్తి రఘునందన్, తాడూరు బిక్షపతి, తాడెం రాజశేఖర్, ర్యాకల శ్రీనివాస్, చిందం మల్లికార్జున్, కాలేరు లక్ష్మణ్, బబ్లు, ఖాజం, ఇస్మాయిల్, ముజీబ్, సిల్వేరు మధు, మహిళా నాయకులు రత్నపురం పద్మ, పావని, వనజ, సుభాష్, శివ,నాగు, నితీష్, సూరజ్, ఇండ్ల శ్రీను, అజయ్ పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా బయటకు వచ్చిన విద్యార్థులు

## ఆటో ఎక్కి ప్రమాదానికి గురై ..ఒకరు మృతి

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్ 10 : ఆశ్రమ పాఠశాల విద్యార్థులు.. చెప్పకుండా బయటకు వచ్చి ప్రమాదానికి గురయ్యారు. వారిలో ఒకరు మృతి చెందారు. కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎలాంటి అనుమతి లేకుండానే బయటకు వచ్చారు. ఇదే వారి పాలిట శాపంగా మారింది. అనుకోకుండా జరిగిన ప్రమాదంలో ఓ విద్యార్థిని ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఈ ప్రమాదంలో మిగిలిన విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెంలో ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లాలోని దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు అనుమతి లేకుండా బయటకు వచ్చారు. నలుగురు విద్యార్థులు ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కారు. అయితే తునికి చెరువు దగ్గర ఆటో ప్రమాదానికి గురైంది. వేగంగా దూసుకొచ్చిన కార్.. విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థిని మృతి చెందింది. కుంజాదీపక్ అనే ఎనిమిదో తరగతి విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. మృతి చెందిన విద్యార్థి దుమ్ముగూడెం మండలం బండారీ గూడెంగా తెలుస్తోంది. ఆటోలో మిగిలిన విద్యార్థులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వారిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చనిపోయిన విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అల్లూరి జిల్లా ఎటపాక పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదం జరిగింది. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మహిళల అభివృద్ధి కోసమే వక్ఫ్ బోర్డు చట్ట సవరణ

చెన్నై,ఆగస్ట్ 10 : మహిళల అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టిందని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, సినీ నటి ఖుష్బూ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లింలు తరతరాల నుంచి మతం పేరుతో ఆచరిస్తున్న 'ముత్తలాక్' పేరుతో మహిళలను బానిసలుగా చూశారని, ఏ వర్గంలో అయినా మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ముత్తలాక్ చట్టాన్ని నిషేధించి, ముస్లిం మహిళలకు స్వేచ్ఛ కల్పించడంతో పాటు ఆస్తులపై సమాన హక్కు కూడా వర్తింపజేశారని తెలిపారు. ప్రస్తుతం పార్లమెంటులో గురువారం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు కూడా ముస్లిం మతపెద్దలతో చర్చించిన తర్వాతే తీసుకొచ్చారని, అయితే ఈ బిల్లును ప్రతిపక్షాలు రాజకీయంగా పరిగణిస్తూ వ్యతిరేకించడం సరికాదని ఖుష్బూ పేర్కొన్నారు.

# శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన వరద

## పదిగేట్లు మాత్రమే ఎత్తి నీటి విడుదల

శ్రీశైలం,ఆగస్ట్ 10 : కృష్ణ ఎగువ పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం తగ్గు ముఖం పట్టింది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి ఎగువ జూరాల నుండి 1,84,786 క్యూసెక్కులు, తుంగభద్ర ద్వారా 17,916 క్యూసెక్కుల నీటితో కలిపి 2,02,702 క్యూసెక్కులు శ్రీశైలం జలాశయానికి చేరుతున్నాయి. శ్రీశైలం పది గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జునసాగర్‌కు 2,69,280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటి మట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 882.50 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకుగాను ప్రస్తుతం 201.588 టిఎంసిలుగా నమోదయింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి హంద్రీనీవా సుజల స్రవంతికి (ముచ్చుమర్రి)కి 1203 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 25,000 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1020 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎడమ గట్టు భూగర్భజల విద్యుత్తు కేంద్రంలో 37,540 క్యూసెక్కుల నీటితో 16.649 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేస్తున్నారు. 29,888 క్యూసెక్కుల నీటితో 15.215 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేస్తూ దిగువ సాగర్‌కు 67,428 క్యూసెక్కులు, పది గేట్లతో కలుపుకొని 2,36,708 క్యూసెక్కులన్నిటిని విడుదల చేస్తున్నారు.

# ట్రస్మా స్టేట్ బాడీ సభ్యులకు సన్మానం



గజ్వేల్, రోమింగ్ న్యూస్: గజ్వేల్ డివిజన్ ట్రస్మా ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా జనరల్ బాడీ మీటింగ్ సాయి జిడిఆర్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేట్ ప్రెసిడెంట్ ఎస్ .మధుసూదన్, జనరల్ సెక్రటరీ ఎన్. రమేష్ రావు , ట్రెజరర్ పి.రాఘవేంద్ర రెడ్డి, రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షులు టి. సోమేశ్వర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ ఏ శ్రీనివాస్ రెడ్డి , ట్రెజరర్ కే. రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. రాజేందర్ గార్ల ఆధ్వర్యంలో స్టేట్ బాడీ సభ్యులకు సన్మానించడం జరిగింది. సిద్దిపేట జిల్లాలోని ట్రస్మా సభ్యుల అందరికీ రాష్ట్ర బాడీ ఆధ్వర్యంలో మెంబర్షిప్ సర్టిఫికెట్స్ అందజేయడంతో పాటు, జిల్లాల వారీగా ప్రైమరీ మరియు హై స్కూల్ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించి, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉత్తమ విద్యను ప్రైవేటు పాఠశాలలో చదివే విద్యార్థిని, విద్యార్థులకు అందించాలని పెద్దలు తెలియజేయడం జరిగింది. రాష్ట్రంలోని అన్ని బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్ మిత్రులకు 10 లక్షల జీవిత బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ట్రస్మా తరఫున కల్పిస్తామని తెలియజేస్తూ, సెప్టెంబర్ నెలలో వచ్చే గురుపూజోత్సవం పురస్కరించుకొని ప్రతి ప్రైవేటు పాఠశాలలో పనిచేసే ఉత్తమ ఉపాధ్యాయులకు, సెప్టెంబరు 5 న సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాలని సభలో తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, గజ్వేల్ డివిజన్ కు చెందిన పాఠశాల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



# సెక్యులరిజం ప్రజల గుండెల్లో ఉన్నది : ఆర్టీఐ మాజీ జాతీయ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్





భువనగిరి,ఆగస్టు10(రోమింగ్ న్యూస్) : రాజ్యాంగంలో సెక్యులరిజం అనే పదాన్ని తీసి వేస్తే పోయేది కాదు ప్రజల గుండెల్లో ఉన్నదని ఆర్.టి.ఐ మాజీ జాతీయ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. శనివారం ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో ఉన్న శ్రీ సాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్లో 10,11 తేదీల్లో జరుగుతున్న రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయని ప్రభుత్వం యంత్రాంగాన్ని సైతం మైనార్టీలపై దాడులకు ఉపయోగించుకుంటున్న దురదృష్ట సంఘటనలు అనేకం జరుగుతున్నాయన్నారు. ఈ మతోన్మాద సాంస్కృతిక క్రమంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా విస్తరిస్తుందని మతోన్మాద శక్తులు విష ప్రచారం తెలంగాణ ప్రజల మనస్సును కలుషితం చేస్తుందని విద్వేష విశబీజాలు ప్రజల మదిలో నాటుకున్నది వందల సంవత్సరాలుగా అన్నదమ్ముల్లాగా కలిసిమెలిసి బతుకుతున్న ప్రజల మధ్య విభజన గీతాలు గిస్తున్నది మతోన్మాద సంస్థలు సృష్టించిన అపోహలు అపార్థాలను దూరం చేయాలన్నారు. మైనార్టీలపై జరుగుతున్న అసత్య విద్వేష ప్రచారాలు ఎండగడుతు రాజ్యాంగాన్ని లౌకిక వాదాని మత సామరస్య విధానాలను ప్రజల్లోకి తిసుక పొవలని రాజ్యాంగ బద్ద హక్కుల పరిరక్షణ కై పోరాటాలు చేయాలని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ మహమ్మద్ రియాజ్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలపై దాడులు పెరిగాయని పార్లమెంట్లో తన కూటమికి సరిపాయే సీట్లు వస్తే దేశంలో ఉన్న రాజ్యాంగాన్ని మార్చడానికి చూశారని ప్రజలు బిజెపికి తగిన సీట్లు ఇవ్వడంలో బుద్ధి చెప్పారని ఇది సెక్యులరిజం విజయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఎం ఏ రహీం, అవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జహంగీర్, అవాజ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యం.ఎ ఇక్బాల్, మీర్ ఖాజా హాలీ, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్కే లతీఫ్, నాయకులు ఎస్.కె ఇమామ్, పాషా మీర్, యూసుఫ్ అలీ, ముక్తార్, హుసేన్, షేక్ అమీద్ పాషా, ఎండి పాషా, ఎస్.కె ఉమర్, అబ్దుల్ రెహ్మాన్, మహ్మద్, సాజీద్ పాల్గొన్నారు

అనంతరం దేశ స్వాతంత్ర ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన జాతీయ యోధుల అమరవీరుల చిత్రపటాల ఎగ్జిబిషన్ ను పట్టణ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు ప్రారంభించారు.

# బాబోయ్..మళ్లీ కరోనా.. పెరుగుతున్న కేసులు

## డబ్ల్యూ.హెచ్. ఓ. హెచ్చరిక

జనగామ, ఆగస్టు 10: (రోమింగ్ న్యూస్) : ప్రపంచ ఆరోగ్య సంస్థ మరోసారి వార్నింగ్ జారీ చేసింది. మళ్లీ కరోనా వ్యాధి ప్రబలుతుందని, కేసులు పెరుగుతున్నాయని హెచ్చరించింది. కొన్ని వారాలుగా 84 దేశాలలో కోవిడ్-19 పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయని పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో కోవిడ్ తీవ్రమైన వైవిధ్యాలతో విస్తరించే అవకాశం ఉందని డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది. 84 దేశాల్లో పాటిజివ్ కేసులు అమాంతంగా పెరిగాయని, ఈసారి తీవ్రత మరో రూపంలో ఉండొచ్చని యూఎన్ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. దేశాలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని డబ్ల్యూహెచ్‌వో డాక్టర్ మరియా వాన్ కెరో□వ్ జెనీవా మీడియాతో అన్నారు. ఐరోపాలో 20 శాతం కంటే ఎక్కువ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. ఇదిలా ఉంటే జూలైలో అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు కోవిడ్ పాజిటివ్ వచ్చింది. ఇక ఒలింపిక్స్ జరుగుతున్న పారిస్‌లో 40 మందికి పరీక్షించగా ఆందోళనకరమైన రిపోర్టులు వచ్చాయని తెలిపారు. అథ్లెట్లు కోవిడ్ లేదా ఇతర శ్వాసకోశ వ్యాధుల బారిన పడ్డారని చెప్పారు. అమెరికా, యూరప్, పశ్చిమ పసిఫిక్‌ల్లో కొత్త ఇన్ఫెక్షన్‌లు నమోదైనట్లు తెలుస్తోంది. కాబట్టి ఎవరికి వారు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 11
ఆగస్టు 2024





# గురుకుల విద్యార్థుల మరణాలపై బిఆర్ఎస్ ఆందోళన

**ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్న ఎమ్మెల్యే సంజయ్**

**పేద పిల్లల ప్రాణాలంటే లెక్క లేదన్న ప్రవీణ్ కుమార్**



హైదరాబాద్,ఆగస్ట్ 10 : గత ఏడు నెలల్లో ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో 36 మంది విద్యార్థులు చనిపోయారని, దాదాపు 500 మంది విద్యార్థులు ఈ ఏడు నెలల్లో ఫుడ్ పాయిజనింగ్ బారిన పడ్డారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి భాషలో చెప్పాలంటే ఈ విద్యార్థుల మరణాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యలే అని చెప్పారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఇంతకు ముందు మంచాన పడ్డ మన్యం అని వార్తలు చూసేవాళ్లం. కేసీఆర్ పదేండ్ల పాలనలో ఆ న్యూస్ కనబడకుండా పోయింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంచాన పడ్డ గురుకుల విద్యార్థులు అని రోజు వార్తలు వస్తున్నాయి. విద్యార్థుల మరణాలపై మంత్రులు, అధికారుల నుంచి స్పందన లేదు. తన సొంత నియోజకవర్గంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్ బారిన పడ్డారని, వారిలో ఇద్దరు మరణించారని తెలిపారు. ప్రభుత్వం వైపు నుంచి విచారణ కూడా జరగలేదు. రేవంత్ రెడ్డి భాషలో చెప్పాలంటే.. ఇది ప్రభుత్వ హత్య. బాధ్యతగల లీడర్‌గా నేను ఈ మాటలు మాట్లాడను. కానీ రేవంత్ ప్రతిపక్షంలో ఉంటే ఈ విధంగానే మాట్లాడేవారు అని సంజయ్ పేర్కొన్నారు. గురుకుల హాస్టళ్లలో నెలకొన్న పరిస్థితిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో 1,200 గురుకులాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గురుకులాల పనితీరును అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, జాగ్రత్తలు తీసుకున్నారని గుర్తు చేశారు. కానీ నేడు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. నాసిరకమైన భోజనాన్ని పిల్లలకు అందించడంతో.. వారు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. హాస్టళ్లలో పాములు, ఎలుకలు ఉండడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.

గురుకుల విద్యావ్యవస్థను రేవంత్ సర్కార్ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందని ఎమ్మెల్యే సంజయ్ మండిపడ్డారు. గురుకులాల్లో చదువుతున్న పేద పిల్లల సంక్షేమం, రక్షణపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో పది రోజుల్లోనే ఇద్దరు విద్యార్థులు పాముకాటుకు బలికావడం, మరో ఇద్దరు వెంటిలేటర్‌పై ఉండడం చూస్తే తెలంగాణలో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో పిల్లల సంక్షేమం ఎవరికీ పట్టనట్టుగా ఉంది. కనీసం అక్కడ డ్యూటీ నర్సులు కూడా లేకపోవడం అంటే మా పేద పిల్లల ప్రాణాలకు రక్షణ లేదా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. కేవలం హైదరాబాద్‌లోని పబ్లిక్, ఇంటర్నేషనల్, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల ప్రాణాలే ముఖ్యమా..? మా పేద పిల్లలవి ప్రాణాలు కావా? అని ఆర్ఎస్పీ ప్రశ్నించారు. పాములు, తేళ్లు, పందికొక్కులు డార్మిటరీలకు రాకుండా రిపేర్లు చేయడానికి ఎన్ని నిధులు మంజూరు చేశారు? ఎన్ని ఖర్చు పెట్టారు..? అని అడిగారు. పిల్లలు ఎ÷–లోర్ మీద పండుకుంటే పాములు కాటువేస్తాయని డబుల్ మంచాలు కూడా కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చింది. మీరెందుకు ఇవ్వలేక పోతున్నారని ఆర్ఎస్పీ నిలదీశారు. గురుకులాలకు, హాస్టళ్లకు పక్కా భవనాలు ఎప్పుడొస్తయి? ఇప్పుడు ఎంత డబ్బు కేటాయించారు..? అణచివేయబడ్డ, వెనకకు నెట్టివేయబడ్డ వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎందుకు ముఖ్యమంత్రిని నిలదీయడం లేదు? మీకు పదవులే ముఖ్యమా ప్రజల ప్రాణాలు ముఖ్యం కాదా ఎస్సీ, ఎస్టీ, బీసీ మానవ హక్కుల కమిషన్లు ఎందుకు మూగబోయాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

## సుంకిశాలపై కాంగ్రెస్ దాగుడుమూతలు

**ప్రమాదాన్ని దాచిపెట్టడంలో ఆంతర్యం**

**మాజీమంత్రి జగదీశ్ రెడ్డి విమర్శ**

సూర్యాపేట,ఆగస్ట్ 10 : సుంకిశాల ప్రాజెక్టు పనులు చేపడుతున్న ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలని మాజీమంత్రి జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, సీఎం చేతగానితనం వల్లే ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిందని వ్యాఖ్యానించారు. హడావుడిగా, ఆగమాగం పనులు చేయించడం వల్లే రిటైనింగ్ వాల్ కూలినట్టు తెలుస్తోందని అన్నారు. ప్రమాదం జరిగిన దాదాపు వారం రోజుల పాటు ఆ విషయం బయటకు రాకుండా ప్రభుత్వం దాచిందని దుయ్యబట్టారు. ప్రభుత్వ పర్యవేక్షణ లోపం వల్ల హైదరాబాద్ ప్రజలకు తీరని నష్టం జరిగిందని, కోట్లాది రూపాయల ప్రజల సంపద నీట మునిగిందని అన్నారు. హైదరాబాద్ నగరానికి తాగునీటి కష్టాలు ఉండకూడదని తాము సుంకిశాల ప్రాజెక్టు పనులను వేగంగా చేపట్టామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ ప్రాజెక్టును పట్టించుకోలేదని అన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టుపై కాంగ్రెస్ అడ్డగోలు విమర్శలు చేసింది. అవన్నీ అబద్ధాలేనని తేలిపోయింది. ఇప్పుడు అక్కడ పది లక్షల క్యూసెక్కుల వరద పోతున్నా బ్యారేజీ చెక్కు చెదరలేదు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీళ్లు ఎత్తిపోసే అవకాశం ఉన్నా.. కేసీఆర్‌కు పేరు వస్తదని ఈ ప్రభుత్వం ఆ పనిచేయడం లేదని దుయ్యబట్టారు. సుంకిశాల ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం తప్పు లేకుంటే, జరిగిన ప్రమాదాన్ని ఇన్ని రోజులుగా ఎందుకు దాచారని కేటీఆర్ ప్రశ్నించారు.

## బంగ్లాలో మరోమారు అల్లర్లు

***సుప్రీం జడ్జిలు లక్ష్యంగా నిరసనలు***

***తక్షణం జడ్జిలు రాజీనామా చేయాలంటూ ఆందోళన***

ఢాకా,ఆగస్ట్ 10 : బంగ్లాదేశ్‌లో మరోసారి అల్లర్లు చెలరేగాయి. ఈసారి నిరసనకారులు సుప్రీంకోర్టును లక్ష్యంగా చేసుకున్నారు. ప్రధాన న్యాయమూర్తి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఇతర న్యాయమూర్తులు దిగిపోవాలంటూ కోర్టు వద్ద నిరసనలు చేశారు. దాంతో ఆయన దిగొచ్చారు. తాను రాజీనామా చేస్తానని వెల్లడించారు. బంగ్లా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి.. ఇతర న్యాయమూర్తులతో సమావేశానికి పిలుపునిచ్చారు. అయితే దీనికి తాత్కాలిక ప్రభుత్వం అనుమతి లేదని, అలాగే ఆయన దేశం విడిచి పారిపోవచ్చనే వార్తలతో ఈ నిరసనలు ఒక్కసారిగా చెలరేగాయి. విద్యార్థులతో పాటు పలువురు నిరసనకారులు సుప్రీంకోర్టు వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. దీంతో న్యాయమూర్తుల సమావేశం అర్ధంతరంగా ఆగిపోయింది. అక్కడితో శాంతించని ఆందోళనకారులు కోర్టును చుట్టుముట్టారు. చీఫ్ జస్టిస్ గంటలో దిగిపోవాలంటూ డిమాండ్లు చేయగా.. ఆయన అందుకు అంగీకరించాల్సి వచ్చింది. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్ హసీనా ఇటీవల వైదొలిగిన విషయం తెలిసిందే. ఆమె ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు దేశాధ్యక్షుడు పార్లమెంటును రద్దు చేశారు. తాత్కాలిక పరిపాలన యంత్రాంగానికి యూనస్‌ను సారథిగా నియమితులయ్యారు. జులై నుంచి దశలవారీగా జరుగుతోన్న ఆందోళనల్లో 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వీటిన వెనక విదేశీ హస్తం ఉందంటూ కథనాలు వెలువడ్డాయి.

## ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనకు కృషి

**ఫైలేరియా రహితంగా తెలంగాణ అభివృద్ధి**

**కేంద్రమంత్రితో వర్చువల్ మీటింగ్‌లో దామోదర**

హైదరాబాద్,ఆగస్ట్ 10 : అసలే వర్షాకాలం కావడంతో రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వ్యాధుల నివారణపై చర్చించడానికి కేంద్ర మంత్రితో రాష్ట్ర మంత్రి వర్చువల్‌గా సమావేశం అయ్యారు. ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ఈ సందర్భంగా పేర్కొన్నారు. జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ అధ్యక్షతన నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో దామోదర్ శనివారం పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయం నుంచి దామోదర్ ఇందులో పాల్గొన్నారు. వీటి నిర్మూలన కోసం సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాలలో 14 ఆరోగ్య కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.తెలంగాణలో ఫైలేరియా, నులిపురుగుల నివారణకు చేపడుతున్న చర్యలను దామోదర్.. కేంద్రమంత్రికి వివరించారు. సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాలో 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రజలకు బోదకాలు వ్యాధి, నులిపురుగుల నివారణకు ఆగస్టు 10 నుంచి మందులుపంపిణీ చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఇందుకుగానూ 2,600 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఇందులో భాగస్వామ్యం చేశామన్నారు. అలాగే 2,522 మంది డ్రగ్ అడ్మినిస్ట్రేటర్లు క్షేత్రస్థాయిలో సేవలందిస్తారని మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా నివారణకు చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహనపత్రాలను, బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. తెలంగాణను ఫైలేరియా నిర్మూలన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో బిహార్, జార్ఖండ్, కర్ణాటక, ఒడిశా, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులు పాల్గొనగా.. తెలంగాణ నుంచి ప్రభుత్వ కార్యదర్శి డా. క్రిస్టినా ఉన్నారు.

## ఎస్సీ రిజర్వేషన్లను అన్ని రాష్ట్రాలు అమలు చేయాలి

**నాలుగు రాష్ట్రాల సిఎంలు ఇప్పటికే ముందుకు వచ్చారు**

**రిజర్వేషన్ల అమలుకు ప్రధాని మోడీ నిర్దుష్ట హామీ**

**రిజర్వేషన్లు అన్ని కుటుంబాలకు అందుబాటులోకి రావాలి**

**ఢిల్లీలో మీడియాతో మందకృష్ణ మాదిగ**

న్యూఢిల్లీ,ఆగస్ట్ 10 : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు రాష్ట్రాలు త్వరగా ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈ రిజర్వేషన్ల వర్గీకరణపై ప్రధాని మోదీ నిర్దిష్టంగా హామీ ఇచ్చారని చెప్పారు. దిల్లీలో మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాకారంలో మోదీ, అమిత్‌షా పాత్ర ఎంతో ఉంది. ప్రధాని, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు రాష్ట్రాలు త్వరగా ముందుకు రావాలి. వర్గీకరణ డిమాండ్ ఉన్న ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలి. వెంటనే అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించాలని మోదీకి విజ్ఞప్తి చేశా. సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ప్రతి జడ్జికీ పేరుపేరునా ధన్యవాదాలు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 70 ఏళ్లు దాటినా రిజర్వేషన్ల ఫలాలు చాలా కుటుంబాలకు అందలేదు. వర్గీకరణకు మద్దతుగా నిలిచిన ప్రతి నాయకుడికీ కృతజ్ఞతలు చెబుతున్నా. ఎస్సీ వర్గీకరణను దక్షిణాదిలో నలుగురు సీఎంలు వెంటనే స్వాగతించారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఏపీ సీఎం చంద్రబాబు ముందుగానే స్పందించి స్వాగతిస్తున్నట్లు చెప్పారని మందకృష్ణ మాదిగ అన్నారు. గతంలో నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణ అమలు చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం జరిగిన టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశంలో కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని సంతోషం వ్యక్తం చేశారు. ఆయనను కలిసి ధన్యవాదాలు తెలుపుతామన్నారు. విదేశీ పర్యటన నుంచి రాగానే సీఎం రేవంత్ రెడ్డిని కూడా కలిసి ధన్యవాదాలు చెబుతామని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. కాగా మందకృష్ణ మాదిగ శుక్రవారం రాత్రి ఢిల్లీలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో వారిని కలిసారు. . దాదాపు 30 నిమిషాలపాటు ప్రధానితో భేటీ అయిన మందకృష్ణ ఎస్సీ వర్గీకరణకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, మంద కృష్ణను ఆప్యాయంగా పలకరించి హత్తుకున్న ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ. తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణ త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని కోరారు. వర్గీకరణ అంశంపై కొందరు సుప్రీం కోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్న నేపథ్యంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుగ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసే అధికారం.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది.

## రుణమాఫీతో రైతు ముఖాల్లో ఆనందం

**గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తికి 431.50 కోట్లు విడుదల**

**రైతు అవగాహనా సదస్సులో మంత్రి పొన్నం**

సిద్దిపేట,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): దేశంలో ఎక్కడ లేని విధంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు రుణమాఫీ చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం రామవరంలో వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలపై అక్కన్నపేట మండలం రామవరం రైతు వేదిక క్లస్టర్‌లో మంత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన పొన్నం.. ఇప్పటికే లక్షన్నర లోపు ఉన్నవారికి రుణమాఫీ జరిగిందన్నారు. వచ్చే వారం రోజుల్లో 2 లక్షల వరకు రుణమాఫీ జరుగుతుందన్నారు. వ్యవసాయంలో సంప్రదాయ పంటల్లో వచ్చే ఆదాయం కన్నా అధిక ఆదాయం రావాలంటే భిన్నమైన పంటలు వేయాలని మంత్రి సూచించారు. మీకు కావాల్సిన పథకాలపై దరఖాస్తు చేసుకున్న నుంచి బ్యాంక్ లోన్ల వరకు అన్ని ప్రభుత్వం చూసుకుంటుందని చెప్పారు.



గౌరవెల్లి ప్రాజెక్టుకి 431.50 కోట్ల రూపాయలు విడుదల చేశామన్నారు. ప్రాజెక్ట్ పూర్తి చేసి రైతుల ముఖాల్లో ఆనందం చూడాలన్నారు. ఈ క్రమంలో వారం రోజుల్లో రూ.2లక్షల వరకూ రైతు రుణమాఫీ చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణ మాఫీ చేసి రైతులకు అండగా నిలిచారని మంత్రి కొనియాడారు. ఇప్పటికే రూ.లక్ష లోపు, రూ.1.50లక్షల లోపు రుణాలు ఉన్న రైతులకు మాఫీ చేసినట్లు వ ంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. వచ్చే వారం రోజుల్లోగా రూ.2లక్షల వరకు మాఫీ చేసి అన్నదాతలకు అండగా నిలుస్తామని చెప్పుకొచ్చారు. సాంకేతిక సమస్యల వల్ల రుణమాఫీ రాని వారు ప్రతిపక్షాల మాటలకు భయపడి ఆందోళనకు గురి కావద్దని సూచించారు. నగదు జమ కాని వారు కంగారు పడొద్దని, మాఫీకి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని మంత్రి చెప్పారు. గృహ జ్యోతి పథకం కింద 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే వంట గ్యాస్ అందని లబ్దిదారులు స్థానిక మండల కార్యాలయాల్లో ఫిర్యాదు చేయాలని మంత్రి పొన్నం చెప్పారు. వ్యవసాయంలో మంచి లాభాలు ఆర్జించాలంటే సంప్రదాయ పంటలకు భిన్నంగా వాణిజ్య పంటలు వేయాలని రైతులకు సూచించారు. అధిక ఆదాయం పొందేందుకు భిన్నమైన పంటలు ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు.

## కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా టీవీ సోమనాథన్

**రెండేళ్ల పాటు పదవిలో ఉండేలా ఉత్తర్వులు**

న్యూఢిల్లీ,ఆగస్ట్ 10 : కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి టీవీ సోమనాథన్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ శనివారం నిర్ణయం తీసుకున్నది. ఈ నెల 30 నుంచి రెండేండ్ల పాటు స్వామినాథన్.. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా ఉంటారు. 1987 బ్యాచ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన టీవీ సోమనాథన్ ప్రస్తుతం ఆర్థిక శాఖ కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. క్యాబినెట్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టే వకూ క్యాబినెట్ సెక్రటేరియట్‌లో 'ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)'గా విధులు నిర్వర్తిస్తారని కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. కేంద్ర ఆర్థికశాఖలో 2019 నుంచి వ్యయ విభాగం కార్యదర్శిగా కొనసాగుతున్న టీవీ సోమనాథన్.. 2021లో ఆర్థికశాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. నాటి నుంచి బ్జడెట్ తయారీలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సర బ్జడెట్‌లో సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షాల డిమాండ్లలో సమతుల్యత పాటిస్తూనే బ్జడెట్‌లో ఆర్థిక క్రమశిక్షణకు పెద్ద పీట వేశారు. 1987 బ్యాచ్ తమిళనాడు క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన సోమనాథన్ 2015 ఏప్రిల్ నుంచి 2017 ఆగస్టు వరకూ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో పని చేశారు. గతంలో కార్పొరేట్ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శిగా, ప్రపంచ బ్యాంకు డైరెక్టర్ గానూ పని చేశారు.

## సుంకిశాల రిటైనింగ్‌వాల్ ఘటనపై సమగ్ర దర్యాప్తు

**సిపిఎం నేత జూలకంటి రంగారెడ్డి డిమాండ్**

హైదరాబాద్,ఆగస్ట్10 : సుంకిశాల రిటైనింగ్‌వాల్ కూలిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని, అందుకు బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీఎంఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిన ప్రాంతాన్ని సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. నిర్మాణ పనులు చేస్తున్న మెగా ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కాలపరిమితిలో నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ఈ ప్రాజెక్టుపై జరుగుతున్న పనులను పర్యవేక్షించడం లేదన్నారు. కూలిపోయిన సమయంలో పనిచేసే వారు లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదన్నారు. పర్వేదుల నుంచి సుంకిశాల ప్రాజెక్టు వరకు రోడ్డు అధ్వాన్నంగా ఉందని.. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పనులు కూడా చేయలేదన్నారు. నిర్మాణం చేస్తున్న సంస్థ కొన్ని జాగ్రత్తలు తీసుకొని ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని, వరదలు పైనుంచి వస్తున్నప్పుడు సిమెంట్ పనులు చేయడం, సరిగా క్యూరింగ్ కాలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జరుగుతున్న పనులపై నిరంతరం పర్యవేక్షణ పెట్టి త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం ప్రభుత్వాన్ని కోరింది. ప్రతినిధి బృందంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు బండా శ్రీశైలం, కూనురెడ్డి నాగిరెడ్డి, చిన్నపాక లక్ష్మీనారాయణ, మహమ్మద్ సలీం, పీ నర్సిరెడ్డి, దండంపల్లి సత్తయ్య, షేక్ బషీర్, పూల సత్యనారాయణ, దుబ్బ రామచంద్రం, బాపురెడ్డి ఉన్నారు.

## తెలంగాణలో టిడిపి బలోపేతానికి కృషి

**త్వరలోనే కొత్త అధ్యక్షుడి నియామకం**

**సభ్యత్వ నమోదు తదితర అంశాలపై చర్చించిన బాబు**

హైదరాబాద్,ఆగస్ట్ 10 : తెలుగు ప్రజల కోసం పుట్టిందే తెలుగుదేశం పార్టీ అని, తెలంగాణలోనూ పార్టీ బలోపేతం కావాల్సి ఉందని టిడిపి అధినేత, ఎపి సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో ముఖ్య నేతలతో చంద్రబాబు నాయుడు సమావేశం అయ్యారు. తెలంగాణాలో పార్టీ పునర్నిర్మాణం పై చర్చ జరిగింది., ప్రస్తుతం ఉన్న పార్టీ పదవులు అన్ని రద్దు చేసినట్లు.., రాష్ట్ర నూతన అధ్యక్ష ఎన్నికకు త్వరలో నిర్ణయం తీసుకోబోతున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ స్థాయిలో సభ్యత్వాల నమోదు కార్యక్రమం చేపట్టాలని చంద్రబాబు సూశించారు. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తెచ్చేలా పని చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అందరినీ చూడడానికి ఇక్కడికి వచ్చాను. ముఖ్యమంత్రి అయ్యాక ఒక్క సారే వచ్చాను. మరోసారి ఇక్కడ అందరినీ కలిసి రెండు గంటలు గడుపుదామని వచ్చాను. ఇక్కడ వచ్చిన తరువాత నాకు ఇచ్చిన ప్రతి అప్లికేషన్ తీసుకున్నాను. ఇక్కడ పార్టీ నీ మరోసారి బలోపేతం చేయాలని అందరూ కోరుకుంటున్నారు.. ఇక్కడ పార్టీలో పని చేయడానికి చాలా మంది సిద్ధంగా ఉన్నారు.. వారందరి కోసం పార్టీ బలపర్చాలని అనుకుంటున్నాము.. పార్టీ ఎలా బలపర్చాలనేది ఆలోచన చేస్తున్నాము.. కొన్ని ప్రత్యేకమైన పరిస్థితిలో ఇక్కడ అధ్యక్షున్ని పెట్టలేదు.. ఇక్కడ గత రెండు ఎన్నికలకి దూరంగా ఉన్నాము.. ఊహా జనిత ప్రశ్నలకు సమాధానం చెప్పాను..పార్టీ ని ఎలా బలోపేతం చేయాలని, ప్రజలకు ఎలా సేవలు అందించాలి అనేది ఆలోచిస్తునాం.. తెలుగు ప్రజల కోసం నిరంతరం పని చేసిన పార్టీ టీడీపీ. ఆంధ్రప్రదేశ్ లో వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దానిని దారిలోకి తెచ్చుకోవాలి. తెలంగాణలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను. తెలుగు ప్రజల మనోభావాల కోసం పని చేస్తాము. ఇప్పుడు ఏపీలో ఆలయాలపై దాడులు జరగడం లేదు. గత ప్రభుత్వంలో ఆలయాలపై దాడి చేసిన వారిని పై చర్యలు తీసుకుంటాం. తెలంగాణలో తెలుగు జాతి ఎదగాలి. విజన్ 2047 కోసం పనిచేస్తాం. 2047 వరకు ప్రపంచంలో ఉన్న తెలుగు వారు ఉన్నత స్థాయిలో ఉండేలా చేయడం నా లక్ష్యం. ఆ రోజు 2024 అని మాట్లాడితే నన్ను 420 అన్నారు. సెల్ ఫోన్ గురుంచి మాట్లాడితే నన్ను హేళన చేశారు. రానున్న రోజుల్లో తెలుగు రాష్ట్రాలు టెక్నాలజీలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతాయని ఆయన అన్నారు. అరవింద్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై అనుచిత పోస్టులు

**వ్యక్తిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు**

హైదరాబాద్,ఆగస్ట్ 10 : అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత పోస్టులు పెట్టిన నిందితుడిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేశాడు. తాజాగా జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడిన వీడియోలను సేకరించి స్పీకర్‌పై అనుచిత వాఖ్యలు చేసి, కించపరిచే విధంగా పోస్టులు చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు.ఈ విషయంపై గతంలో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు అసెంబ్లీ కార్యదర్శి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వికారాబాద్ మోమిన్‌పేటకు చెందిన విజయ్ కుమార్ అనే వ్యక్తిని ఈ కేసులో అరెస్ట్ చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. విజయ్ కుమార్ ఎవరు చెబితే ఈ పోస్టులను వైరల్ చేశారన్న అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో మరికొంత మందిని పోలీసులు అరెస్ట్ చేసే అవకాశాలు ఉన్నాయి.

## గ్రామ పాలనను గాలికొదిలేసిన రేవంత్

**గాలిలో మేడలు కడుతున్నట్లుగా ఉంది**

**సిఎం అమెరికా పర్యటనపై అనుమానాలు**

**బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు**

హైదరాబాద్,ఆగస్ట్ 10 : హైదరాబాద్: రేవంత్ ప్రభుత్వం గ్రామ పరిపాలన గాలికొదిలేసి, ఆకాశంలో మేడలు కడుతోందని సిర్పూర్ కాగజ్‌నగర్ బీజేపీ శాసన సభ్యులు పాల్వాయి హరీష్‌బాబు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లారా, ఇంకేమైనా చక్కబెట్టడానికి పోయారనేది తెలియదని ఆరోపించారు. శనివారం నాడు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ... రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పాలని హెచ్చరించారు. కొడంగల్, వికారాబాద్, నారాయణపేట్‌కు మాత్రమే ముఖ్యమంత్రి పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. విద్యా వలంటీర్లను కొడంగల్‌కు మాత్రమే పరిమితం చేస్తున్నారని విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి కొడంగల్‌కు మాత్రమే ముఖ్యమంత్రి కాదని, రాష్ట్రానికి ముఖ్యమంత్రి అని గుర్తించుకోవాలని పాల్వాయి హరీష్‌బాబు హితవు పలికారు.ప్రపంచ ఆదివాసీల కార్యక్రమాలను నిన్ననే ప్రభుత్వం ఊరూర జరుపుకుంది, కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని చెప్పారు. ఆదివాసీల గ్రామాలకు నేటికీ రహదారులు లేవని అన్నారు. కొమురం భీం జిల్లాలో గిరిజన మహిళ డెలివరీ కోసం, పురిటి నొప్పులతో రెండు కిలోమీటర్లు నడవాల్సి వచ్చిందని పాల్వాయి హరీష్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. వాగు దాటగానే దారి మధ్యలోనే డెలివరి అవడంతో పుట్టిన బిడ్డ చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో గిరిజన బతుకులు దయనీయమైన పరిస్థితుల్లో ఉన్నాయని వివరించారు. గిరిజన గ్రామాలకు రహదారులు లేక ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. ఆరోగ్య సమస్యలు వస్తే ఆస్పత్రికి వెళ్లటానికి కిలోమీటర్ల మేర నడవాల్సిన పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని పాల్వాయి హరీష్‌బాబు అన్నారు.గిరిజన బతుకులు ఇలా ఉంటే మంత్రి సీతక్క మాత్రం గిరిజన గ్రామాలకు నాలుగేళ్లలో తారు రోడ్లు వేస్తామని చెబుతున్నారని ఇది త్వరగా సాధ్యం కావాలని కోరుకున్నారు. పల్లెల్లో పాలన పూర్తిగా పడకేసిందని చెప్పారు. పంచాయతీల్లో సర్పంచులు లేరు, పంచాయతీలన్ని గ్రామ కార్యదర్శులకు అప్పజెప్పారని పాల్వాయి హరీష్‌బాబు విమర్శలు చేశారు. తొమ్మిది నెలల్లో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క గ్రామాలకు ఒక్క రూపాయి నిధులను ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు.సీతక్క మీద చాలా నమ్మకం ఉండేదని, కానీ గ్రామాల్లో పరిస్థితులు చూస్తుంటే సీతక్కపై ఆ నమ్మకం కోల్పోయేలా ఉందని అన్నారు. ప్రభుత్వం గ్రామ పరిపాలన గాలికొదిలేసి, ఆకాశంలో మేడలు కడుతోందని విమర్శించారు. రాష్ట్రం, రాష్ట్ర ప్రభుత్వం ఎటు పోతుందో తెలియడం లేదని పాల్వాయి హరీష్ బాబు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులంతా సంపాదించుకునే పనిలో బిజీగా ఉన్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీలు నిర్వీర్యం చేశారని పాల్వాయి హరీష్‌బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 11 ఆగస్టు 2024





## మాల్దీవుల పర్యటనలో విదేశాంగ మంత్రి జైశంకర్

### అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుతో భేటీ

న్యూఢిల్లీ,ఆగస్టు10 : మాల్దీవుల పర్యటనలో ఉన్న భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్.. ఆ దేశ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరూ అనేక అంశాలపై చర్చలు జరిపారు. మూడు రోజులపర్యటనలో భాగంగా ఆగస్టు 11వరకు అక్కడే ఉండనున్న ఆయన.. ఇరు దేశాల ద్వైపాక్షిక అంశాలపై చర్చించనున్నారు. చివరిసారిగా 2023 జనవరిలో జైశంకర్ అక్కడ పర్యటించిన విషయం తెలిసిందే.భేటీకి సంబంధించి 'ఎక్స్'లో స్పందించిన జైశంకర్.. అధ్యక్షుడు డాక్టర్ మొహమ్మద్ ముయిజ్జుతో భేటీ కావడం విశేషమన్న ఆయన.. భారత ప్రధాని మోదీ తరఫున శుభాకాంక్షలు తెలియజేసినట్లు వివరించారు. తమ ప్రజలు, ఈ ప్రాంత ప్రయోజనాల కోసం భారత్-మాల్దీవుల మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయన్నారు. అనంతరం ముయిజ్జు మాట్లాడుతూ.. తమ మిత్రదేశాల్లో భారత్ ఎల్లప్పుడూ ఉంటుందని.. మాల్దీవులకు అవసరమైనప్పుడల్లా సహాయాన్ని అందిస్తుందని అన్నారు.

## 50 గ్రాముల కాలిఫోర్నియం స్వాధీనం

### మార్కెట్లో రూ.850 కోట్ల విలువ.. వెల్లడించిన పోలీసులు

పాట్నా,ఆగస్టు 10 : అత్యంత విలువైన రేడియో యాక్టివ్ పదార్థం కాలిఫోర్నియంను బిహార్ లోని గోపాల్ గంజ్ పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. దాదాపు 50 గ్రాముల బరువున్న ఈ పదార్థం విలువ అంతర్జాతీయ మార్కెట్లో రూ.850 కోట్లకు పైమాటే. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ స్వార్న్ ప్రభాత్ ధ్రువీకరించారు. నిందితులు ఈ పదార్థాన్ని అక్రమ రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు. మా జిల్లా నుంచి విలువైన రేడియో ధార్మిక పదార్థాన్ని అక్రమ రవాణా చేస్తున్నట్లు ఓ టిప్ వచ్చింది. దీంతో మేం బృందాలు సిద్ధం చేశాం. డిస్ట్రిక్ట్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌ను అప్రమత్తంగా ఉంచాం. స్పెషల్ ఆపరేషన్ గ్రూప్, ఎస్టీఎఫ్ దళాలను రంగంలోకి దించాం. వీరిని ఉత్తరప్రదేశ్-బిహార్ సరిహద్దుల్లో మోహరించాం. ఈ సమయంలో మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా.. నాలుగు మొబైల్ ఫోన్లతోపాటు 50 గ్రాముల కాలిఫోర్నియం కూడా బయట పడింది. అంతర్జాతీయ మార్కెట్లో దీని ధర గ్రాము రూ.17 కోట్లు అని ఎస్పీ ప్రభాత్ వెల్లడించారు. నిందితులను చోటే లాల్ ప్రసాద్, చందన్ గుప్తాగా గుర్తించారు. వీరు ఈ కాలిఫోర్నియంను విక్రయించేం దుకు కొన్ని నెలలుగా యత్నిస్తున్నట్లు చెప్పారు. దర్యాప్తును ముందుకు తీసుకెళ్లేందుకు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నుంచి ప్రత్యేక బృందాన్ని రప్పించామన్నారు. కాలిఫోర్నియంను పోర్టబుల్ మెటల్ డిటెక్టర్లలో వినియోగిస్తారు. వీటితో బంగారం, వెండి ఇతర విలువైన లోహాలను గుర్తించవచ్చు. దీంతోపాటు ఇంధన బావుల్లో నీరు, చమురు పొరలు గుర్తించేందుకు వాడతారు. ఇక విమానాల్లో లోహాల అరుగుదలను అంచనావేసేందుకు కూడా వినియోగించవచ్చు.

## రచ్చకెక్కిన ఎమ్మెల్సీ దువ్వాడ ఫ్యామిలీ

### భర్త ఇంటిముందు భార్యాపిల్లల ఆందోళన

### తన భార్య వాణి తీరుపై మండిపడ్డ శ్రీనివాస్

శ్రీకాకుళం,ఆగస్టు 10 : ఆంధ్రప్రదేశ్‌లో ఓ ఎమ్మెల్సీ కుటుంబ వ్యవహారం ఇప్పుడు రచ్చ చేస్తోంది. వ్యక్తిగత వివాదాలు కాస్తా రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అక్రమ సంబంధాలు, ఫ్యామిలీ గొడవలు రచ్చకెక్కాయి. ఇంటిముందు భార్యా పిల్లల ధర్నా, ఆందోళనతో వార్త ఒక్కసారిగా దుమారం రేపింది. ఇంట్లో ప్రియురాలు.. ఆ పక్కింట్లో ఇల్లాలు అన్నట్లుగా దువ్వాడ వ్యవహారం దుమారం రేపింది. ఈ విషయంపైనే శ్రీనివాస్ ఇంటి ముందు ఆయన భార్య, కుమార్తెల నిరసన వ్యక్తం చేస్తున్నారు. భార్య, కూతుళ్లని చూసి ఇంటి గేటు వేసుకుని లోపలే ఉన్న దువ్వాడ శ్రీనివాస్‌ను ఆయన కుటుంబ సభ్యులు నిలదీశారు. తన భర్త వివాహేతర సంబంధం కారణంగా పరువు పోతోందని భార్య వాణి ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు.. ఒక మహిళ కారణంగా తమ తండ్రి తమకు దూరంగా ఉంటున్నారని ఆయన కూతురు హైందవి ఆవేదన వ్యక్తం చేస్తోంది. అయితే, ఈ వివాదానికి కారణమైన మాధవి.. దువ్వాడ వాణిపై తీవ్ర ఆరోపణలు చేయగా.. వాణి తిరగి ఎదురు సమాధానం ఇచ్చింది. కుటుంబాలను కూల్చే బాపతు మాధవి అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇతరుల జీవితాతల్లో ప్రవేశించి.. కుటుంబాలను నాశనం చేయడమే మాధురి పని అని విమర్శించారు. తమ జీవితంలోకి రాకముందు.. అనేక మంది జీవితాలను ఇలాగే నాశనం చేసిందని వాణి ఆరోపించారు. శ్రీనివాస్, మాధురి తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి అబద్దాల మీద అబద్ధాలు చెబుతున్నారని వాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే దువ్వాడ వాణి తనను ట్రాప్ చేసి.. తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుందని మాధురి ఆరోపించింది. శ్రీనివాస్‌తో స్నేహంగా ఉండేదానని చెప్పుకొచ్చింది. ఎమ్మెల్యే టికెట్ కోసం దువ్వాడ వాణి తను బ్యాడ్ చేసిందని మాధురి ఆరోపించింది. అవిడ చెబుతున్నవన్నీ అబద్దాలేనని అన్నారు. తమ మధ్య ఇల్లీగర్ రిలేషన్ లేదని చెబుతోంది. మరోవైపు భార్య వాణితీరును దువ్వాడ శ్రీనివసా÷- వ్యతిరేకిస్తున్నారు. ఏ రంగంలో తాను ఎదిగినా అందులో దాన్ని లాక్కునే దువ్వాడ వాణికి తనపై మొదటి నుంచి ద్వేషం ఉందని తీవ్ర విమర్శలు చెప్పుకున్నారు. తన భార్య అని ఎక్కడా చెప్పని దువ్వాడ శ్రీనివాస్ తన భార్యగా ఆమె చెప్పుకుంటోందని అంటూ విమర్శలు చేస్తూ వచ్చారు. తన భార్యగా చెప్పుకొనే వాణి అంటూ ఎదురుదాడి ప్రారంభించారు. పాతికేళ్లుగా రాజకీయాల్లో ఉన్న తాను ఎప్పుడూ అక్రమాలు చేయలేదని ప్రజల కోసమే పని చేశాను అన్నారు. ఓడినా గెలిచినా తనకు ప్రజల శ్రేయస్సే ముఖ్యమని వివరించారు. ఎన్నికల ముందు నుంచి మొదలైన తన కుటుంబ వివాదం ఇప్పుడు మరింత రచ్చకెక్కిందన్నారు. తానేమీ స్థితిమంతుడిని కానని... ప్రజలకు ఎంతోకొంత సాయం చేయాలని రాజకీయాల్లోకి వచ్చాన్నారు. రాజకీయాలను కుటుంబాన్ని ఏనాడు నిర్లక్ష్యం చేయలేదన్నారు. భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలను అల్లారు ముద్దుగా పెంచానన్నారు. వారికి వైద్యవిద్యను అందించాని వివరించారు. పెళ్ళైన మొదటి నుంచే తనపై వాణి అసూయ ద్వేషం పెంచుకున్నారని శ్రీనివాస్ అన్నారు. రాజకీయాలనే కాదు, లాభాల్లో ఉన్న తన వ్యాపారాలను లాక్కునేందుకు కూడా ఆమె పేరు మీద రాయించేందుకు కూడా ఒత్తిడి చేశారని గుర్తు చేశారు. నిత్యం తనను ఎన్నో రకాలుగా వేధించారని ఆరోపించారు. తనపై లేనిపోని ఆరోపణలు చేసి కుమార్తెల మెదళ్లలో వాణి విషం నింపారని ఆరోపించారు ఇప్పుడు వాళ్లే తనపై తిరుగుబాటు చేసేలా చేసి ఘనత వాణిదేనన్నాం ం. 2019 ఎంపీ ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా ఫ్యామిలీని మరికొందరి ప్రోత్సహించి తన ఓటమికి వాణి కారణయ్యారని ఆరోపించారు దువ్వాడ. ఓ సందర్భంలో తనపై డంబెల్‌తో దాడికి యత్నించిందన్నారు. ఆ టైంలో తాను తప్పించుకో బోయే క్రమంలో కింద పడి కాలు విరిగిపోయిందన్నారు. ఆ ఎన్నికల్లో కాలికి కట్టుతోనే ప్రచారం చేశానన్నారు. టెక్కలి టికెట్ విషయంలో కూడా చాలా చర్చలు జరిగాయన్నారు శ్రీనివాస్. దువ్వాడ శ్రీనివాస్‌కు టికెట్ ఇస్తామని జగన్ చెప్పడంతో తాను ఆత్మహత్య చేసుకుంటానని వాణి బెదిరించారని అన్నారు. అప్పుడు తన రాజకీయ జీవితాన్ని ఫణంగా పెట్టి టికెట్ కూడా ఇచ్చానని అన్నారు. అయితే ఆమెను అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత పార్టీ గ్రాఫ్ పడిపోవడంతో అధినాయకత్వం మళ్లీ తనకే టికెట్ కేటాయించదన్నారు దువ్వాడ శ్రీనివాస్.

## మహిళలకు ఆర్టీసీ శుభవార్త

### కార్గో సర్వీసుల్లో రాఖీల డోర్ డెలివరీ

హైదరాబాద్,ఆగస్టు 10 : ఈ నెల 19వ తేదీన రాఖీ పండుగ నేపథ్యంలో టీజీఎస్ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రాఖీ పండుగకు నాలుగైదు రోజుల ముందు నుంచి కార్గో సెంటర్లలో ప్రత్యేక కౌంటర్లు తెరిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.దూర ప్రాంతాల్లో ఉన్న తమ సోదరులకు సోదరీమణులు రాఖీలు పంపేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. రాఖీలతో పాటు స్వీట్ బాక్సులు, బహుమతులు, ఇతర సామగ్రిని కూడా పంపే అవకాశం కల్పించారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు రాఖీలను పంపించుకోవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం అన్ని బస్టాండ్లలోని కార్గో సెంటర్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్గో సెంటర్లలో బుక్ చేసిన 24 గంటల్లోనే రాఖీలను డెలివరీ చేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. కార్గో అధికారులు కౌంటర్లు తెరవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, రాఖీల రవాణా ధర ఇంకా ఖరారు కాకపోవడంతో ఉన్నతాధికారుల అనుమతి కోసం వేచి ఉన్నారు. రాఖీల రవాణకు సంబంధించిన ధరల విషయంలో సోమవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## డార్క్‌వెబ్ ద్వారా డ్రగ్స్ ఆర్డర్

### వలపన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అరెస్ట్

హైదరాబాద్,ఆగస్టు 10 : డార్క్ వెబ్ ద్వారా డ్రగ్స్ కొనుగోలు చేసిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను తెలంగాణ నార్కోటిక్ పోలీసులు పట్టుకున్నారు. వెబ్ ద్వారా మాదకద్రవ్యాలను ఆర్డర్ చేస్తున్నట్టు అనుమానం వచ్చి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై పోలీసులు నిఘా పెట్టారు. జులై 31న డార్క్ వెబ్ ద్వారా డ్రగ్స్ రాష్ట్రానికి వస్తున్నట్టు సమాచారంతో అతనిపై దృష్టి పెట్టారు.అస్సాం నుంచి స్పీడ్ పోస్టులో ఖమ్మం జిల్లాకు మత్తు పదార్థాలు వస్తున్నాయని సమాచారం తెలుసుకున్నారు. ఈనెల 8న డ్రగ్స్ డెలివరీ చేస్తున్న క్రమంలో టీజీన్యాబ్, ఖమ్మం పోలీసులు సంయుక్తంగా దాడి చేసి మత్తు పదార్థాలను స్వాదీనం చేసుకున్నారు. న్యూస్ పేపర్లో డ్రగ్స్ చుట్టి ప్లాస్టర్ అంటించి డెలివరీ చేసినట్టు పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ కోనుగొలు చేసిన సమయంలో క్రిప్టో కరెన్సీ ద్వారా లావాదేవాలు జరిపినట్లు టీజీన్యాబ్ పోలీసులు గుర్తించారు. పట్టుబడిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు.

# గూగుల్ ప్రధాన కార్యాలయంలో సిఎం రేవంత్

### పలు అంశాలపై అధికారులతో చర్చ

### సెంటర్ విస్తరణకు జోయిటిస్ కంపెనీ సుముఖం



హైదరాబాద్,ఆగస్టు 10 : అమెరికాలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన కొనసాగుతోంది. కాలిఫోర్నియాలో గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సీఎం సందర్శించారు. ఆ సంస్థ ప్రతినిధులతో ఆయన చర్చలు జరిపారు. రాష్ట్ర అభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై రేవంత్‌రెడ్డి చర్చలు జరిపినట్లు సీఎం కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. గూగుల్ ప్రతినిధులు వారికి ఆహ్వానం పలికారు.సీఎం వెంట మంత్రి శ్రీధర్‌బాబు, ఐటీ, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు. ప్రపంచంలో ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థగా పేరొందిన జోయిటిస్ కంపెనీ హైదరాబాద్‌లోని కెపాబులిటీ సెంటర్ విస్తరించాలని నిర్ణయించింది. 2024 సెప్టెంబర్ నుంచి ఈ విస్తరణ కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించింది. దీంతో వందలాది మందికి కొత్త ఉద్యోగాలు లభించనున్నాయి. హైదరాబాద్‌లో జోయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్‌ను విస్తరించనున్నట్లు ప్రకటించింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (అఓ ఖీ।లజీనిబిఠ ఖీ।టటా), మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు అధికారుల బృందంతో కంపెనీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో తమ జోయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్‌ను విస్తరించే నిర్ణయాన్ని స్వాగతించారు. తెలంగాణలో కొత్త ఆవిష్కరణలకు, వ్యాపార వృద్ధికి అపారమైన అవకాశాలున్నాయని అన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దాలనే తమ ఆలోచనలకు ఈ పెట్టుబడులు దోహదపడుతాయన్నారు. వందలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలో జోయిటిస్ రంగ ప్రవేశం హైదరాబాద్‌కు మరింత గుర్తింపు తెస్తుందని సీఎం అన్నారు. ఇండియాలో తమ కంపెనీ విస్తరణకు హైదరాబాద్ అనువైన ప్రాంతమని, తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావటం సంతోషంగా ఉందని జోయిటిస్ కంపెనీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కీత్ సర్‌బాగ్ అన్నారు. తమ కంపెనీ విస్తరణ జంతు ఆరోగ్యానికి సంబంధించి సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు ఉపయోగపడుతుందన్నారు. హైదరాబారద్‌లో అందుబాటులో ఉన్న ప్రపంచ స్థాయి ప్రతిభా వనరులను సద్వినియోగం చేసుకుంటామని జోయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రాఘవ్ అన్నారు. ప్రపంచంతో పోటీ పడే సేవలందించటంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకుంటామన్నారు. జోయిటిస్ కంపెనీ విస్తరణ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వనరులు, తమ ప్రభుత్వ విధానాలపై ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబించిందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రాబోయే సంవత్సరాల్లో కొత్త ఉద్యోగాలతో పాటు జంతు ఆరోగ్య సంరక్షణలో మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కంపెనీ విస్తరణకు ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందన్నారు. జోయిటిస్ కంపెనీ దాదాపు 70 సంవత్సరాలుగా జంతువుల అనారోగ్యం, రోగ నిర్ధారణ, నిరోధించే మార్గాలు, చికిత్స సంబంధిత అంశాలపై పని చేస్తోంది. జంతు సంరక్షణలో భాగంగా పశు వైద్యులు, పెంపుడు జంతువుల యజమానులు, రైతులకు అండగా నిలుస్తోంది. ఔషధాలతో పాటు వ్యాక్సిన్‌లు, రోగ నిర్ధారణలో కొత్త సాంకేతికత, ఆవిష్కరణలపై దాదాపు వంద దేశాలకు సేవలు అందిస్తోంది.

# వ్యవసాయాన్ని పరిశ్రమగా అభివృద్ధి చేయాలి


### పంటల విధానంలో మార్పులకు శ్రీకారం చుట్టాలి

### సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా నిర్ణయాలు

న్యూఢిల్లీ,ఆగస్ట్ 10 : రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలని సూచించారు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణమాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. సస్య విప్లవానికి నాంది పలకాలి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమం గానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. వ్యవసాయరంగంలో విప్లవాత్మకనిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం వచ్చింది. పంటల ఎగుమతులు లక్ష్యంగా వ్యవసాయం మారాలి. సేంద్రియం వైపు సాగు మళ్లకుంటే ప్రజలు మరింతగా అనారోగ్యం పాలు కాగలరని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు మారాల్సి ఉంది. స్వాతంత్ర్యం లభించి 76సంవత్సరాలు పూర్తయినా ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్నప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. మనరైతులనే ప్రోత్సహించి పంటల దిగుబడి పెంచుకోవాలి. పెరిగిన ఉత్పత్తులను ఎగుమతి చేసుకునేలా విధానాలు రూపొందించాలి. రైతులను కాపడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. కరువులు వచ్చినా, వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారుతున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. వ్యవసాయ భూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చలేక, అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకే సరిపోతుంది. ప్రతి ఎకరాకు కౌలు 10 వేల నుంచి 25 వేల రూపాయల వరకు భూమి యజమానులకు చెల్లించవలసి వస్తుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం మంచిగా అయినప్పటికీ ధరలు రాక నష్టపోతు న్నారు. వర్షాలు లేని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్ట పోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. మార్కెట్‌లో రైతును దోచుకునే శక్తులు నిరాటంకంగా విజృంభి స్తూనే ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగిపోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగదీస్తున్నాయి. చాలామంది రైతులు, కౌలుదారులు బ్యాంకు రుణాలు పొందలేక పోతున్నారు, వడ్డీ వ్యాపారస్థుల దగ్గర అప్పు తీసుకుంటే తడిసి మోపెడవుతుంది. ఈ సమస్యలను అధిగమించి రైతుకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు రుణామాఫీ ప్రకటించి మొక్కుబడి తీర్చుకుంటు న్నారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహకాలు పెంచాలి.

## తిరుచానూరులో వరలక్ష్మీ వ్రతం

### వచ్చే శుక్రవారం కోసం భారీగా ఏర్పాట్లు



తిరుపతి,ఆగస్ట్ 10 : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీవ్రతం నిర్వహణకు టీటీడీ ఏర్పాటు చేస్తోంది. ఈ నెల 16 న శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరపనుంది. ఇందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది. వరలక్ష్మీ వ్రతం రోజు తెల్లవారుజామున మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేకం నిర్వహించనున్న అర్చకులు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయంలోని ఆస్థాన మండపంలో వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరపనున్నారు. ఈమేరకు వ్రతం నిర్వహణ కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనే గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక వడ టిటిడి అందజేయనుంది.వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారి ఆలయంలో ఆర్జితసేవలైన అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, కుంకుమార్చన, వేదాశీర్వచనం, బ్రేక్ దర్శనం, సహస్ర దీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది. మహామంగళ దేవత గా లక్ష్మీ అవతారమై వెలసిన అలమేలు మంగమ్మ తిరుచానూరు ఆలయంలో జగత్కల్యాణం కోసం అవతరించిందని భావించే భక్తులు వరలక్ష్మీ వ్రతంలో పాల్గొంటే విశేష ఫలాలు చేకూరుతాయని నమ్మకం. వ్రతం చేసే రోజున ఉదయాన్నే మంగళ స్నానం చేసి, నూతన వస్త్రాలు ధరించి ఆలయంలో అర్చకులు ఏర్పాటుచేసిన మండపంలో కొలువైన వరలక్ష్మీ దేవిని దర్శిస్తారు. వరలక్ష్మీ వ్రతం రోజు అమ్మవారికి ఆభరణాలను అలంకరిస్తారు. లక్ష్మీమాతను పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం అర్చకులు ఆవాహనం చేసి షోడశోపచార పూజలు చేస్తారు. రక్ష కట్టిన తరువాత పసుపు, కుంకుమ, పూలతో వ్రతాన్ని సుసంపన్నం గావించి, వ్రతమహాత్యం కథను అర్చకులు పటిస్తారు.

## తెలంగాణలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటు

### పరిశీలిస్తామన్న మంత్రి రామ్మోహన్ నాయుడు

హైదరాబాద్,ఆగస్ట్ 10 : తెలంగాణలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటును పరిశీలిస్తామని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. విమానాశ్రయాల భద్రతలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రయాణికులు సైతం విమానాశ్రయాల్లో తనిఖీలు, భద్రత పట్ల అవగాహన కలిగి ఉండి.. భద్రతా సిబ్బందికి సహకరించాలని కోరారు. చంద్రబాబు హయాంలోనే శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బీజం పడిందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. అప్పుడు ఇంత భూమి ఎందుకు కేటాయించారని పలువురు విమర్శలు చేశారన్నారు.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వీక్ నిర్వహించారు. కార్యక్రమంలో రామ్మోహన్ నాయుడు పాల్గొని మొక్కలు నాటారు. తల్లిపేరు మీద మొక్క నాటాలన్న ప్రధాని మోడీ సూచనలతో ప్రతి ఒక్కూ మొక్కలు నాటాలని అన్నారు. అనంతరం మాట్లాడుతూ.. చంద్రబాబు దూరదృష్టితోనే శంషాబాద్ విమానాశ్రయానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు వచ్చిందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కేంద్రమంత్రి సూచించారు.

## బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం

### సావోపాలో వద్ద కుప్ప కూలిన విమానం

### 61మంది ప్రయాణికుల దుర్మరణం

న్యూఢిల్లీ,ఆగస్ట్ 10 : బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. సావోపాలో వద్ద ఓ విమానం అదుపు తప్పి కుప్ప కూలింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న 61 మంది ప్రాణాలు కోల్పోయారు. సోషల్ మీడియాలో ఈ ప్రమాద దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. గాల్లో అదుపు తప్పి చక్కర్లు కొట్టిన విమానం ఒక్కసారిగా కూలిపోయింది. భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుంది. ఘటనా స్థలానికి పక్కనే ఇళ్లున్నాయి. వాటి వెనకాల చెట్ల పొదల్లో కూలిపోయింది. విమానంలో ఉన్న వాళ్లలో ఒక్కరు కూడా ప్రాణాలతో లేరని అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఓ ఇల్లు ధ్వంసమైనట్టు తెలిపారు. స్థానికులకు ఎలాంటి గాయాలు కాలేదని స్పష్టం చేశారు. ఈ ఘటనపై బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాకియో లూలా డా సిల్వా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలుపుతూ ఓ నిముషం మౌనం పాటించాలని పిలుపునిచ్చారు. ఈ ఘటనపై స్పందించింది. కాస్కావెల్ నుంచి టేకాఫ్ అయిన విమానం..విన్హెడో టౌన్‌లో ప్రమాదానికి గురైనట్టు వెల్లడించింది. అయితే...ఈ ప్రమాదానికి కారణమేంటన్నది మాత్రం ఇంకా తెలియలేదని వివరించింది. విచారణ జరుగుతోందని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపింది. ప్రస్తుతానికి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పుతోంది. ప్రమాదానికి ముందు చేసిన ట్రాకింగ్ ప్రకారం విమానం 4,100 అడుగుల ఎత్తులో ఉంది. సావోపాలోకి వచ్చే సమయంలోనే ఇలా కుప్ప కూలిపోయింది. ప్రత్యక్ష సాక్ష్యులు ఈ ప్రమాదాన్ని తలుచుకుని వణికిపోతున్నారు. కొంచెంలో పెను ప్రమాదం తప్పిందని, లేకపోతే విమానం నేరుగా తమ ఇళ్లపై పడిపోయేదని వివరిస్తున్నారు. ఈ శబ్దం వినగానే ఒక్కసారిగా గుండె ఆగిపోయినట్టుగా అనిపించిందని అంటున్నారు. ఈ శబ్దం విన్న వెంటనే చాలా మంది బయటకు పరిగెత్తుకుంటూ వచ్చారు. ఇళ్ల వెనకాలే పొదల్లో విమానం పడిపోవడాన్ని చూసి షాక్ అయ్యారు.

## మేఘాకు దోచిపెడుతున్న సిఎం రేవంత్

### సుంకిశాల కూలి పదిరోజులైనా పట్టింపేది

### బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపణలు

హైదరాబాద్,ఆగస్ట్ 10 : కాంట్రాక్టుల పేరుతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంట్రాక్టర్ మేఘా కృష్ణారెడ్డికి రాష్ట్ర సంపద దోచి పెడుతున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. నాసిరకం పనులు చేస్తుందంటూ మేఘా కంపెనీకి కేంద్ర ప్రభుత్వం షోకాజ్ నోటీసులు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సుంకిశాల ప్రాజెక్టు కూలిపోయి 10రోజులు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి రాలేదా అంటూ ఆయన మండిపడ్డారు. సుంకిశాల పనులు మేఘా కంపెనీయే చేసిందని, అలాంటిది కొడంగల్‌లో చేయబోతే పనులను సైతం ముఖ్యమంత్రి అదే కంపెనీకి ఇవ్వబోతున్నట్లు మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో మేఘా కృష్ణారెడ్డిపై సీఎం రేవంత్ రెడ్డి సీబీఐకి ఫిర్యాదు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడేమో క్రిమినల్ కాంట్రాక్టర్ మేఘా కృష్ణారెడ్డికే సీఎం దోచిపెడుతున్నారంటూ సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణలో గొర్రెలను తినేటోడు పోయి.. బర్రెలను తినేటోడు వచ్చాడని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దోచుకున్న అవినీతి సొమ్ములో రేవంత్ రెడ్డి వాటా అడుగుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోందని చెప్పుకొచ్చారు. వీరిద్దరికి మధ్యవర్తిగా కాంట్రాక్టర్ మేఘా కృష్ణారెడ్డి సెటిల్మెంట్ చేస్తున్నట్లు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 11 ఆగస్టు 2024





# బడ్జెట్ సమావేశాలు ముగించారు!

కొత్త పార్లమెంట్ భవనం అందుబాటులోకి వచ్చి ఏడాది కావస్తోంది. కొత్త భవనంలో పాత విధానాలతోనే కార్యక్రమాలు సాగుతున్నాయి. సరైన చర్చలకు ఆస్కారం కలగడం లేదు. బడ్జెట్ సమావేశాలు కూడా యథాలాపంగా సాగాయి. పెద్దగా చర్చలు సాగలేదు. బడ్జెట్ క్రతువును ముగించేలా నిర్ణయాలు జరిగాయి. మమ అనిపించి పార్లమెంట్ సమావేశాలు ముగించారు. ఎప్పుడూ నాలుగైదు రోజులు ముందే సమావేశాలు ముగుస్తున్నాయి. దేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలు వారికి కానరావడం లేదు. బంగ్లాదేశ్‌లో ఊచకోతలపైనా చర్చించలేదు. కనీసం చర్చించివుంటే..ప్రపంచం దృష్టికి దాష్టీకాలను తీసుకుని వచ్చే అవకాశం ఉండేది. ఇకపోతే ప్రధాన సమస్యలపైనా చర్చ చేయలేదు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఎప్పటిలాగే తిరస్కరించారు. ఓ రకంగా చెప్పాలంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టాక చరిత్ర సృష్టించే నిర్ణయాలు తీసుకుంటుందని ఆశించారు. కానీ అలాంటి దేమీ కనిపించలేదు. జిఎస్టీపై ప్రశ్నలు లేవనెత్తితే ..అది ప్రజల సమస్యగా భావించి చర్చించాల్సిన ప్రభుత్వం విపక్షాలను ఎండగట్టేలా సమాధనం చెప్పిన తీరు జాతి మరువదు. మూడోదఫాలో మరింత సమర్థంగా,మరింత ఉత్సాహంగా పనిచేస్తానన్న మోడీ వచనాలు ఎక్కడా ప్రతిఫలించలేదు. దేశంలో అభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు సాగుతున్నాయన్న నమ్మకం కలిగించలేకపోయారు. ప్రజల సమస్యలను విస్తృతంగా చర్చించాలి. ఇందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వడం ద్వారా సమస్యలప చర్చ జరిపి ఉంటే బాగుండేది. విపక్షాలు కూడా ఉపన్యాసాలకు, రాజకీయ వ్యాఖ్యలకు అలవాటు పడ్డారు. అందువల్ల సమస్యలను గుర్తించ చర్చించాలన్న ఆలోచన లేకుండా సాగుతున్నారు. ఇకపోతే దేశహితం కోసం మరిన్ని కఠిన చట్టాలను రూపొందించాలి. చర్చల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలి. ఎన్నికల్లో అక్రమాలు నిరోధించేలా నిర్ణయాలు రావాలి. అయితే బడ్జెట్ సమావేశాల్లో మరిన్ని నిర్ణయాల కోసం ప్రజలు ఎదురు చూసినా ఫలితం దక్కలేదు. తిరంగా యాత్రను ప్రారంభించారు. ప్రజల్లో దేశభక్తి లేక కాదు. ప్రజల్లో ఉన్నంతగా నేతల్లోనూ భక్తి రావాలి. ప్రజల జీవన ప్రమాణాలు పడిపోకుండా చూడాలి. వారు అప్పుల్లో కూరుకుపోకుండా బతికేలా నిర్ణయాలు ఉండాలి. కానీ అలాంటి ప్రయత్నాలు కానరావడం లేదు. అలాగే పార్లమెంట్ సీట్ల సంఖ్యను పెంచడం... గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం కూడా అత్యవశ్యకమే. గవర్నర్ వ్యవస్థ ఈ మధ్యకాలంలో రాజకీయాంగా దుమారం రేపుతోంది. అలాగే ఖజానాపైనా భారీగా భారం పడుతోంది. గవర్నర్ వ్యవస్థలేని రాజ్యాలను నడుపుకోవాల్సి ఉంది. అలాగే ఎప్పుడో 50 ఏళ్ల క్రితం ఉన్న జనాభాకు అనుగుణంగా పార్లమెంట్ సీట్లు ఉన్నాయి. 542 సీట్లతోనే కొనసాగిస్తున్నాం. ఈ క్రమంలో లోక్‌సభ, రాజ్యసభలతో పాటు, అసెంబ్లీల్లో సీట్ల సంఖ్య పెరగాల్సి ఉంది. వాటిని ప్రస్తుత జనాభాకు అనుగుణంగా పెంచుకోవాల్సిందే. కనీసం వేయి సీట్లు ఉంటేనే ఇప్పుడున్న జనాభాకు తగిన ప్రాతినిధ్యం దక్కదు.140కోట్లు ఉన్న జనాభాకు అనగుణంగా పార్లమెంట్ సీట్లను పెంచుకోవాలి. అలాగే దేశానికి అనవసర వ్యవస్థగా ఉన్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి. పంచాయితీల్లో ఎంపిటిసిలు,జడ్పీటీసిల వ్యవస్థను ఎత్తేయాలి. పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను దేశ, రాష్ట్రాల జనాభాకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ జరగాలి. ఒకేదేశం, ఒకే చట్టం కోసం కసరత్తు జరుగుతున్న వేళ ఇలాంటి కీలక నిర్ణయాలు కూడా జరగాలి. ఇలాంటి అంశాలపై పార్లమెంటులో చర్చించివుంటే బాగుండేది. ఇకపోతే ఎపిలో కాకినాడను ఆనుకుని ఉన్న యానాంను పాండిచ్చేరిలో కాకుండా ఎపిలో విలీనం చేయడమే మంచిది. దీంతో ప్రజలకు కూడా పాలనా కేంద్రం దగ్గర కాగలదు. దీనిపై పాలకులు ఎందుకనో డిమాండ్ చేయడం లేదు. ఇలాంటి అసమానతలను చర్చిస్తే మంచిది.

ఇందుకోసం పార్లమెంటులో చర్చించాలి. వ్యవస్థల ద్వారా మేలు జరగాలి. ఉపయోగం కలగాలి. అంతేకానీ గుదిబండగా మారరాదు. అలాగే ఆర్థిక భారంగా కూడా మారరాదు. దేశంలో ప్రస్తుత రాజకీయ వ్యవస్థ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పటిష్టమైన ఎన్నికల విధానం కూడా అవసరం ఉంది. ఇవన్నీ చర్చించడం ద్వారా నవ భారతానికి శ్రీకారం చుట్టాలి. స్వాతంత్య్రోత్సవాలు జరుపుకుంటున్న వేళ ఇవన్నీ చర్చిస్తే మంచిది. అలాగే మహిళల ప్రాతనిధ్యం పెంచే మహిళా బిల్లును కూడా ఆమోదింప చేయడం, కోల్డ్‌స్టోరేజీకి పంపడం జరిగింది. మొన్నటి ఎన్నికల నుంచే దీనిని అమలు చేసివుంటే మహిళలకు న్యాయం జరిగివుండేది. 370 ఆర్టికల్‌ను రద్ద చేయడం లాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న మోడీ ప్రభుత్వానికి ఈ నిర్ణయాలు ఏమంత పెద్దవి కాక పోవచ్చు.

గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఆదర్శ రాజకీయాలకు శ్రీకారం చుట్టాలి. ఇకపోతే పార్లమెంట్ వర్షకాల సమావేశాలు శుక్రవారంతోముగిశాయి. లోక్ సభ వాయిదా పడిన వెంటనే స్పీకర్ ఓం బిర్లా తేనీటి విందు ఇచ్చారు. టీ పార్టీకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ సా, కిరణ్ రిజిజు, రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్, ఎంపీలు సుదీప్ బందోపాధ్యాయ, కనిమొళి తదితరులు హాజరయ్యారు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. స్పీకర్ తేనిటి విందుకు హాజరైన ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎప్పుడూ ఉప్పు, నిప్పుగా ఉండే వీరు కలిసి ఫొటోలకు ఫోజిచ్చారు. వాస్తవానికి లోక్ సభ ఆగస్ట్ 12వ తేదీన వాయిదా పడాలి. సభా వ్యవహారాలు పూర్తయినందున సమావేశాలు ముగించామని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఈసారి సభకు ఎక్కువ మంది సభ్యులు హాజరయ్యారని వివరించారు. సమావేశంలో బడ్జెట్ బిల్లుకు ఆమోదం లభించింది. జమ్ముకశ్మీర్ విభజన బిల్లు, ఇండియన్ ఎయిర్ క్రాఫ్ట్ బిల్లులకు కూడా సభ ఆమోదం లభించింది. వక్ఫ్ బిల్లుపై జెపిసిని వేశారు. ఇంతకు మించి ఈ సమావేశాల్లో పెద్దగా ప్రయోజనం చేకూర్చే అంశాలు లేవు.

# బంగ్లాదేశ్‌లో హిందువులను రక్షించండి

**ఎక్స్ వేదికగా సినీ నటి ప్రీతి జింటా ఆవేదన**

న్యూఢిల్లీ,ఆగస్ట్ 10 : బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేసి, దేశం విడిచిపెట్టి వెళ్లిపోయినా అందోళనలు ఆగడం లేదు. మైనారిటీల లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బంగ్లాలో అల్లర్లపై నటి ప్రీతి జింటా ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి మైనారిటీలపై జరుగుతున్న దాడిని చూసి గుండె పగిలిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. జనాన్ని చంపుతున్నారు. మహిళలపై అత్యాచారాలకు తెగబడుతున్నారు. ఆలయాలపై దాడులు చేస్తున్నారు. ఈ హింస ఆగేలా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నా. దేశ ప్రజలను కాపాడుతుందని అనుకుంటున్నా. కష్టాల్లో ఉన్నవారి కోసం ప్రార్థిస్తున్నా' అని ప్రీతి జింటా ట్వీట్ చేశారు. దీనికి సేవ్‌బంగ్లాదేశీహిందూస్ అనే హ్యాష్ ట్యాగ్‌ను జత చేశారు. ఇప్పుడీ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు తమదైనశైలిలో స్పందిస్తున్నారు.

# సోమశిల పనులు అర్ధాంతరంగా నిలిపివేత

**గత వైసిపి ప్రభుత్వ నిర్వాకంతో జిల్లాకు నష్టం**

**మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి**

నెల్లూరు,ఆగస్ట్10 : సోమశిల ప్రాజెక్ట్ హైలెవల్ కెనాల్ పనులను జగన్ ప్రభుత్వం ఎందుకు నిలిపివేసిందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రశ్నించారు. కాంట్రాక్టర్ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయకుండా పారిపోయారని ఆరోపించారు. శనివారం నాడు జెడ్పీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం మీడియాతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం సోమశిల పనులు చేయలేదు కాబట్టే, తాను ఆ పార్టీ నుంచి బయటకు వచ్చానని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో చాలా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని అన్నారు.ఎమ్మెల్యేలతో కలిసి స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ముందుకు వస్తే, ఆ పనులను పూర్తి చేయడానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నెల్లూరు జిల్లాలో 80 శాతం వ్యవసాయ ఆధారిత ప్రాంతమేనని వెల్లడించారు. సోమశిలకు వరద వచ్చి సోమేశ్వర ఆలయం కొట్టుకుపోతే, వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఉద్ఘాటించారు.అభివృద్ధి, పనులు చేసిన వారిని ప్రజలు మరచిపోరని అన్నారు. అభివృద్ధి చేస్తే ప్రజలు పట్టం కడతారని అనడానికి తానే నిదర్శనమని గుర్తుచేశారు. పెన్షన్ల పంపిణీ వలంటరీ వ్యవస్థ ఉంటేనే సాధ్యమవుతుందని జగన్ ప్రభుత్వంలో చెప్పారని.. కానీ కూటమి ప్రభుత్వంలో వలంటరీ వ్యవస్థతో పనిలేకుండానే ఫించన్లు పంపిణీ చేసి చూపించామని గుర్తుచేశారు. సినరీస్ సెస్‌ను బలోపేతం చేసి స్థానిక సంస్థలకు నిధులు వచ్చేలా చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు.వచ్చే ఐఏబీ సమావేశంలోపు పూర్తి స్థాయిలో ఆయకట్టు వివరాలు సేకరిస్తామని తెలిపారు. పోలవరాన్ని త్వరలో పూర్తి చేసి ఏపీని సస్యశ్యామలం చేసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో అన్నమయ్య డ్యామ్, సోమశిల డ్యామ్ కింది భాగాలు కొట్టుకుపోతే దిక్కులేకుండా పోయిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉందని... రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం సోమశిల హైలెవల్ కెనాల్ పనులను నిలిపివేసిందని మంత్రి నారాయణ (ఒతినినిజలివతీ జెజీఔ-జీఎజీజిజీ) తెలిపారు. శనివారం నాడు జెడ్పీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం మీడియాతో మంత్రి నారాయణ మాట్లాడారు. జిల్లాలో అన్ని సమస్యలపై చర్చించామని అన్నారు. 1950 ఆయకట్టు ఆధారంగానే నీటి విడుదల జరుగుతుందని తెలిపారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. జిల్లాలో స్థాయి తీసుకుండానే బిల్లులు పనులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని..

వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.కండలేరు ఆయకట్టు 2.20 లక్షల ఎకరాలు 2019 వరకు ఉండగా, గత ఐదేళ్లలో ఒక్క ఎకరానికి కూడా ఆయకట్టు పెరగలేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి (౧నీఎతితీవటటఎ అష్ట్రజీనిటతీజీఎనీష్ట్రజీని ఖీవటటఎ) తెలిపారు. గతేడాది రైతులు మూడు లక్షల ఎకరాల పొలాలను బీడుగా పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లస్కర్లకు జీతాలు లేవని, కాలువల్లో పూడికలు, బురద తీయలేదని చెప్పారు. జనవరిలో సర్వేపల్లిలో పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్నారని తన దగ్గర ఆధారాలు ఉన్నాయని చెప్పారు. గ్రామాల్లో పనులు చేశారో, లేదో రైతులనే అడగాలని కలెక్టర్‌ని కోరారు. రెండేళ్ల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఆరు నెలలకి ఎందుకు తగ్గించారు? అని ప్రశ్నించారు. రైతుల ఊసురు పోసుకున్న ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని మండిపడ్డారు. చెరువులో కట్టిన జగనన్న కాలనీల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని అన్నారు. రైతులను వేధించి, హింసించి, బాధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు.

# రెండో అంతస్తు నుంచి కిందపడ్డ దంపతులు

**భర్త మృతి.. భార్యకు తీవ్ర గాయాలు**

హైదరాబాద్,ఆగస్ట్ 10 : రెండో అంతస్తు పైనుంచి దంపతులు కిందపడడంతో భర్త మృతి చెందగా భార్య తీవ్రంగా గాయపడిన సికింద్రాబాద్‌లోని రెజిమెంటల్ బజారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివకాల ప్రకారం శనివారం ఉదయం పని నిమిత్తం భవనం వద్దకు గిరి- లక్ష్మమ్మ వచ్చారు. రెండో అంతస్తులో పని చేస్తుండగా దంపతులు కిందపడ్డారు. భర్త గిరి ఘటనా స్థలంలోనే చనిపోగా భార్య లక్ష్మమ్మ తీవ్రంగా గాయపడడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. గోపాలపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు కింద పడ్డారా? లేక ఎవరైనా వారిని కిందకు తోసేశారా ఆత్మహత్య చేసుకున్నారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# గ్రామ పంచాయతీలు,సర్పంచ్‌ల వ్యవస్థ బలోపేతం

**కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: పవన్ కళ్యాణ్**

అమరావతి,ఆగస్ట్10 : గ్రామ పంచాయతీలు , సర్పంచ్‌ల వ్యవస్థ బలోపేతానికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కీలకమైన గ్రామీణ వ్యవస్థకు జీవం పోయాలన్నదే తమ తపన అని డిప్యూటి సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఆర్థికంగా గ్రామ పంచాయతీలను పరిపుష్టంగా చేయాలనే సంకల్పంతోనే గ్రామ సభల నిర్వ హణ, జల్‌జీవన్‌మిషన్ నిధుల వ్యయంపై పల్స్ సర్వే, స్వాతంత్య, గణతంత్ర వేడుకల నిర్వహణకు పంచాయతీలకు నిధుల పెంపు నిర్ణయాలను తీసుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు కోసం గ్రామ సభలను రాష్ట్రంలోని 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకేసారి నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. జాతీయ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో ఏ పనులు చేయాలి? దేనికి ప్రాధాన్యం ఇవ్వాలి? ఎలాంటి పనులకు ఆమోదం తెలపాలి? అనే విషయాలనే గ్రామసభల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటారన్నారు. ఉపాధి నిధులతో కొత్తకళ తీసుకురావడం, ఆయా గ్రామాల్లో ఉన్న సౌకర్యాల కల్పన, మౌలిక వసతుల పెంపు వంటి విషయాను గ్రామసభల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటారని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. గ్రామ- సభల్లో ఆయా గ్రామాలకు ఏయే పనులు అవసరమో గుర్తించి వాటిని వెంటనే ఉపాధి పథకంలో చేపట్టేలా చొరవ తీసుకుంటామన్నారు. జల్‌జీవన్‌మిషన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందనిగత ఐదేళ్లలో జల్‌జీవన్‌మిషన్ పథకంలో రూ.4వేలకోట్లు ఖర్చు పెట్టినట్లు అధికారులు చెబుతున్నారని, అయితే వాటి ప్రతిఫలాలు మాత్రం క్షేత్రస్థాయిలో అందినట్లు దాఖలాల్లేవన్నారు. జల్‌జీవన్‌మిషన్ పనులపై వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు జరిగిన పనులు ,ఖర్చుచేసిన నిధులపై వివరాలు తెలుసుకునేందుకు పల్స్ సర్వే పేరుతో ఓ సర్వేనిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు డిప్యూటీ సిఎం పేర్కొన్నారు. రాష్ట్ర మంతా జరిగే ఈ సర్వేలో వెలుగుచూసేఅంశాలను ప్రజల ముందు పెట్టి ,జల్‌జీవన్‌మిషన్ నిధులను ,పథకాన్ని సమర్థంగా ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. గ్రామ సర్పంచ్‌ల ఆత్మగౌరవం తగ్గకుండా చూస్తామని, దేశం కోసంపనిచేస్తున్న సైనికులు, పారిశుధ్యకార్మికులు సత్కరించుకునేలా కార్యక్రమాలను నిర్వహించాలనిసర్పంచ్‌లను కోరుతున్నట్లు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను డిస్కమ్‌లకు తీసుకోవడంతో పంచాయతీల ఆర్థిక పరిపుష్టి కోల్పోయాయన్నారు.కనీసం బ్లీచింగ్ పౌడర్‌కొనడానికి కూడా డబ్బులులేవని సర్పంచ్‌లు పలుమార్లు తమ వద్ద ఆవేధన వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచి గ్రామీణప్రాంతాల సర్వతోముఖాభివృద్ధి దిశగా అడుగులు వేయాలని తమ కూటమి ప్రభుత్వం బలంగా భావిస్తోందని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

# ఇండ్ల స్థలాల కోసం జర్నలిస్టులు నిరసన దీక్ష

**దీక్షకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సంఘీభావం**

జగిత్యాల,ఆగస్ట్ 10 : జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం నిరసన దీక్షలో పాల్గొనడం బాధాకరమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట జర్నలిస్టులు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని 8వ రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా బాధ్యతలు నిర్వహిస్తుందన్నారు. అనేక విషయాలపై అవగాహన కలిగి సమాజాన్ని మేల్కొలిపే స్థానంలో జర్నలిస్టులు ఉన్నారన్నారు. వారికి ఉండే అనేక ఇబ్బందులను, ఆర్థిక పరిస్థితులను అధిగమించి జర్నలిస్టులుగా కొనసాగుతున్నారన్నారు. వారికి ప్రభుత్వం ఇండ్ల పట్టాలు ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి తాను మంత్రిగా ఉన్న సమయంలో ధరూర్ క్యాంప్‌లో ప్రతి జర్నలిస్టుకి రెండు గంటల స్థలాన్ని కేటాయించాలని భావించి గతంలో ప్రతిపాదనలు పెట్టామన్నారు. కలెక్టర్‌తో మాట్లాడామని.. కేటీఆర్ సైతం కలెక్టర్‌తో మాట్లాడారని తెలిపారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలనుకుంటే పెద్ద అడ్డం కాదన్నారు. వారు ఎవరికీ శత్రవులు కాదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుగా లేదని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెద్దగా ఉండకపోవచ్చన్నారు. కలెక్టర్ ఈ విషయంలో దృష్టి సారించి ఓ నిర్ణయం తీసుకోవాలని కోరారు. మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, హరి చరణ్ రావ్, లోక బాపురెడ్డి, గోస్కుల జలేందర్, గాదె మాధవరావు సైతం దీక్షకు మద్దతు తెలిపారు.

# భవిష్యత్ ప్రణాళిక ఆవశ్యం

తిరుమల,ఆగస్ట్10 : జీవితంలో ప్రణాళిక అవసరం. ప్రణాళికాబద్ధంగా జీవితాన్ని విభజించుకుని సాగాలి. ఈ క్రమంలో భవిష్యత్తు గురించి ముందుగా ప్రణాళికలు వేసుకుని పనిచేసే సామర్థ్యం చాలా మందికి ఉండదు. ఎందుకంటే మనం వర్తమానానికి బందీలం. పక్కనేఉన్న ప్రమాదాలను, సంతోషాలను అధిగమించి పనిచెయ్యడం ఒక గొప్ప శక్తి. వెనక్కి తగ్గే స్వభావాన్ని విడిచిపెట్టాలి. కళ్లకు కనిపించే దానికన్నా భవిష్యత్తులో గొప్పవి జరగబోతున్నాయని ఊహించడం నేర్చుకోవాలి.సాధారణంగా మనం తప్పులు చెయ్యడానికి కారణం- మన దగ్గరగా ఉన్న ప్రమాదాలకు భయపడటం, దూరంగాఉన్న ప్రమాదాలను పట్టించుకోకపోవడం! వాటినిగాని మనం ముందుగా ఊహించి అంచనా వెయ్యగలిగితే చాలా పొరపాట్లు నివారించవచ్చు.ఒకవేళ అనుకోని ప్రమాదం ఏదైనా ఎదురైతే, దాన్ని తెలివిగా మనకు అనుకూలంగా మార్చుకోవాలి. ఆంజనేయుడి తోకకు రావణాసురుడు నిప్పుపెట్టాడు. లంకలో రాక్షసులంతా తెగ ఆనందపడిపోయారు, హనుమంతుడు కాలి బూడిదైపోతాడని. అలా జరగలేదు. లంకనే తన తోకతో తగలబెట్టాడు హనుమంతుడు. ప్రమాదాన్ని తనకు అవకాశంగా ఉపయోగించుకుని చరిత్రలో ఒక గొప్ప రసవత్తరమైన ఘట్టంగా మలిచాడు ఆయన.పనులు ప్రారంభించేటప్పుడు వ్యవహారం నడిపేది మనం. వాటిని ఒక పద్ధతిలో నడిపించేది మనమే. ఒకసారి అవి ప్రారంభమయ్యాక, చాలాసార్లు అవే మనకు దారి చూపిస్తాయి. మన లక్ష్యాన్ని నెరవేరుస్తాయి!

# 17 నెలల తరవాత టీ తాగుతున్నా

**భార్యతో కలిసి టీ తాగుతున్న ఫోటో విడుదల**

**రాజ్‌ఘాట్‌లో మహాత్ముడికి నివాళి**

**హనుమాన్ దేవాలయ ంలో పూజలు**

**ఆప్ నేత మనీష్ సిసోడియా దినచర్య ప్రారంభం**

న్యూఢిల్లీ,ఆగస్ట్ 10 : ఆలస్యంగానైనా నిజాయితీ, సత్యమే గెలిచాయని ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా అన్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అరెస్టయ్యి 570 రోజులకుపైగా జైల్లో ఉన్న మనీశ్‌సిసోడియాకు బెయిల్ లభించడంతో.. శుక్రవారం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. శనివారం ఉదయాన్నే కన్నాట్ ప్లేస్‌లోని హనుమాన్ దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మనీశ్‌సిసోడియాతో పాటు పలువురు ఆప్ నేతలు కూడా ఉన్నారు. సిసోడియా మాట్లాడుతూ.. భజరంగ్ బలి ఆశీర్వాదంతోనే తాను జైలు నుంచి బయటకు వచ్చానని చెప్పారు. త్వరలో సీఎం కేజ్రీవాల్ కూడా భజరంగ్ ఆశీర్వాదంతో జైలు నుంచి విడుదలవుతారని అన్నారు. ఆ తర్వాత సిసోడియా సహా ఆప్ నేతలంతా మహాత్మాగాంధీ స్మారకమైన రాజ్‌ఘాట్‌కు వెళ్లి గాంధీజీకి నివాళులు అర్పించారు. ఆ తర్వాత ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిసోడియా మాట్లాడుతూ.. ఆలస్యమైనా ఆఖరికి నిజాయితీ, సత్యమే గెలిచాయని వ్యాఖ్యానించారు. ఈ కష్టకాలం తనకు మానసికంగా మరింత బలాన్నిచ్చిందని సిసోడియా చెప్పారు. ఓ ఏడెనిమిది నెలల్లో తనకు న్యాయం జరుగుతుందని భావించానని, కానీ 17 నెలల కాలం పట్టిందని అన్నారు. ఆలస్యమైనా సత్యమే గెలువడం సంతోషకరమని చెప్పారు. ఈ కష్టకాలం తనకు మానసికంగా మరింత బలాన్నిచ్చిందని సిసోడియా చెప్పారు. బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ పోకడలపై ప్రతిపక్ష కూటమి ఏకతాటిపైకి వచ్చి పోరాడాల్సిన అవసరం ఉందని సిసోడియా అన్నారు. ఇవాళ జైల్లో ఉన్నది ఆప్ కార్యకర్తలు, నేతలేగదా మనకెందుకు అనుకుంటే..రేపు మీ వంతు కూడా రావచ్చని వ్యాఖ్యానించారు. అందరం ఒక్కతాటిపైకి వచ్చి పోరాడితే నియంతృత్వం అంతమ వుతుందని, కేజ్రీవాల్ కేవలం 24 గంటల్లోనే జైలు నుంచి బయటికి వస్తాడని అన్నారు. ఇకపోతే మనీలాండ రింగ్‌తో ముడిపడిన దిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా 17 నెలల తర్వాత జైలు నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ఉదయం తొలిపోస్టు పెట్టారు. ఇంట్లో తన సతీమణితో కలిసి టీ తాగుతున్న చిత్రాన్ని షేర్ చేశారు. 17 నెలలకు లభించిన స్వేచ్ఛ తర్వాత ఉదయం ఇంట్లో టీ తాగుతున్నాను. భారతీయులందరికీ రాజ్యాంగం స్వేచ్ఛగా జీవించే హక్కు కల్పించింది. ప్రతిఒక్కరితో కలిసి స్వేచ్ఛా వాయువులు పీల్చుకునే హక్కును ఆ దేవుడు మనందరికీ ఇచ్చాడు' అని సిసోదియా పోస్టు పెట్టారు. మద్యం కుంభకోణం కేసులో గతేడాది ఫిబ్రవరి 26న సీబీఐ అధికారులు అప్పటి దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియాను అరెస్టు చేయగా, ఆ తర్వాత కొన్ని రోజులకు ఈడీ కూడా కస్టడీలోకి తీసుకుంది. అరెస్టయిన రెండు రోజుల తర్వాత ఉప ముఖ్యమంత్రి పదవికి సిసోదియా రాజీనామా చేశారు. అప్పటినుంచి గత 17 నెలలకు పైగా జైల్లోనే ఉన్నారు. ఆయన బెయిల్ అభ్యర్థనలు పలుమార్లు తిరస్కరణకు గురికావడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఏ నిందితుడినీ కాలపరిమితి లేకుండా జైలులో ఉంచలేరు. కేసు విచారణలో పురోగతి లేకపోయినా.. ఒక పరిమితి దాటిన తర్వాత ఆ వ్యక్తిని జైల్లో ఉంచడం సరికాదు. అలాకాదంటే ఆ వ్యక్తి హక్కులను హరించడమే అవుతుంది. బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవడం, ఉపశమనం పొందడం నిందితుల హక్కు' అని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. మనీశ్ సిసోదియా సమాజంలో బలమైన సంబంధాలు ఉన్న వ్యక్తి అని, ఆయన విదేశాలకు పారిపోయే అవకాశమే లేదని అభిప్రాయపడింది. సిసోదియా బెయిల్ అభ్యర్థనలను తోసిపుచ్చుతూ మే 21న దిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. అలాగే కొన్ని షరతులు విధించింది. నిందితుడు తన పాస్‌పోర్ట్‌ను ట్రయల్‌కోర్టుకు అప్పగించాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని ఆదేశించింది. ప్రతి సోమవారం,గురువారం ఉదయం దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని స్పష్టంచేసింది. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం వల్లే తాను బెయిల్‌పై రాగలిగానని తిహాడ్ జైలు నుంచి వెలుపలికి వచ్చిన సిసోదియా అన్నారు. ఇదే జైలులో ఉన్న దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ కూడా త్వరలోనే విడుదలవుతారనే ఆశాభావం వ్యక్తంచేశారు. దీనిపై భాజపా స్పందించింది. ఆప్ నేతల విమర్శలపై భాజపా తీవ్రంగా స్పందించింది. బెయిల్ వచ్చిందని మరీ ఆనందపడొద్దని కౌంటర్ ఇచ్చింది. కోర్టు తీర్పులను భాజపా గౌరవిస్తుంది. కానీ, బెయిల్ వచ్చినంత మాత్రాన.. కేసు నుంచి విముక్తి లభించినట్లు కాదు. ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమే. దీనిపై దర్యాప్తు జరుగుతోందని వ్యాఖ్యానించింది.

# యూ ట్యూబ్ మాజీ సిఇవో సుసాన్ మృతి

**రెండేళ్లుగా క్యాన్సర్ పోరాడి మృత్యువాత**

**తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సుందర్ పిచాయ్**

క్యాలిఫోర్నియా,ఆగస్ట్ 10 : యూట్యూబ్ మాజీ సీఈవో సుసాన్ వోజ్‌కికీ కన్నుమూశారు. ప్రస్తుతం ఆమె వయసు 56 ఏళ్లు. సుసాన్ మరణవార్తను ఆమె భర్త డెన్నిస్ ట్రోపర్ సోషల్ మీడియా ద్వారా ధృవీకరించారు. ఈ మేరకు భావోద్వేగ పోస్ట్ పెట్టారు. రెండేళ్లుగా ఊపిరితిత్తుల క్యాన్సర్ తో పోరాడుతున్నట్లు చెప్పారు. ఇవాళ కుటుంబాన్ని వదిలేసి తిరిగిరాని లోకానికి వెళ్లిపోయిందంటూ భావోద్వేగానికి గురయ్యారు. యూఎస్‌కు చెందిన సుసాన్ 2014 నుండి 2023 వరకు యూట్యూబ్ సీఈవోగా పనిచేసిన విషయం తెలిసిందే. అంతకు ముందు ఆమె గూగుల్‌లో పనిచేశారు. ఈ నేపథ్యంలో సుసాన్ మృతిపై గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాలు క్యాన్సర్‌తో పోరాడిన తన స్నేహితురాలు మరణించడం నమ్మశక్యంగా లేదని పేర్కొన్నారు. తను ఓ అద్భుతమైన వ్యక్తి అని, ఆమె లేని ప్రపంచాన్ని ఊహించడం కష్టమన్నారు. కాగా, గూగుల్‌లో సుసాన్ కీలక వ్యక్తిగా వ్యవహరించారు. ఇంటర్నెట్‌ను రూపొందించడంలో ముఖ్యపాత్ర పోషించారు.

# ఆశ్రమ పాఠశాలలకు సన్నబియ్యం

**అక్రమాలు నిరోధించేలా చర్యలు**

నిజామాబాద్,ఆగస్ట్ 10 : రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించడంలో భాగంగా సన్నబియ్యం సరఫరా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈ బియ్యం దారిమళ్లుతున్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో పౌరసరఫరాల శాఖ సన్నబియ్యం వినియోగంలో అక్రమాలను అరికట్టేందుకు నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఆయా ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లేదా,వార్డెన్, డిప్యూటీ వార్డెన్లు బియ్యం సరఫరా అవుతున్న ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద వేలిముద్ర వేస్తేనే సన్నబియ్యం విడుదలయ్యేలా నేషనల్ ఇన్‌ఫర్‌మేటిక్ సెంటర్ వెబ్‌సైట్ అభివృద్ధి చేసింది. వేలాదిమంది విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. వారి వివరాలు సంబంధిత ఉపాధ్యాయులు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్నారు. ఆగస్టు నుంచి నూతన విధానం సైతం అమలులోకి వచ్చినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని ఆశ్రమ పాఠశాలలు ఆన్‌లైన్ విధానం ద్వారా సన్నబియ్యం తీసుకెళ్తున్నారు. జిల్లాలో ఆశ్రమ పాఠశాలలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటేనే సన్నబియ్యం అందుతాయి. ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ఈ-పాస్ యంత్రాలను ఉపయోగించి కార్డుదారుల వేలిముద్రలు వేసిన తర్వాతే బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇదే విధానాన్ని ఆశ్రమ పాఠశాలలకు వర్తింపజేస్తున్నారు. ఆయా ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లేదా వార్డెన్, డిప్యూటీ వార్డెన్లు వారి వేలిముద్రలను ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద పెడితేనే బియ్యం సరఫరా చేయనున్నారు. నెలలో ఎంతబియ్యం పాఠశాలకు కేటాయించాలనేది ఆన్‌లైన్‌లోనే లెక్క తేలుతుంది. అటోమెటిక్‌గా ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, నిల్వ ఉన్న బియ్యం ఆధారంగా మరుసటి నెలకు కావాల్సిన బియ్యం కేటాయింపులు ఖరారు అవుతుంది. ఆశ్రమ పాఠశాలలకు అక్కడి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సన్నబియ్యం కేటాయిస్తారు.

# బిజెపి హర్‌ఘర్ తిరంగా యాత్ర

**రాజ్‌కోట్‌లో ప్రారంభించిన జెపి నడ్డా**

న్యూఢిల్లీ,ఆగస్ట్ 10 : బిజెపి హర్‌ఘర్ తిరంగా యాత్ర ప్రారంభం అయ్యింది. గుజరాత్ రాజ్‌కోట్‌లో జెపి నడ్డా దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరంగా యాత్రకు శ్రీకారం చుట్టారు.భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు మరికొద్ది రోజుల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 'హర్ ఘర్ తిరంగా' పేరిట బీజేపీ ప్రచార కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమాన్ని జాతీయ పండగగా నిర్వహించాలని జులైలో మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొని జాతీయ పతాకంతో సెల్ఫీ దిగి.. ఆ చిత్రాన్ని హర్‌తిరంగా.కామ్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు ప్రధాని మోదీ సూచించిన విషయం విదితమే. ఆగస్ట్ 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దేశంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ తిరంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనుంది. అలాగే ఆగస్ట్ 12, 13, 14 తేదీల్లో స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులర్పించనుంది. అదే విధంగా ఈ మూడు రోజులు యుద్ధ స్మారకాలను సందర్శించిన స్వాతంత్య్ర సమరంలో అమరులైన వారికి నివాళులర్పించనుంది. ఇక ఆగస్ట్ 14వ తేదీ దేశ విభజన జరిగిన నేపథ్యంలో మౌన ప్రదర్శన చేపట్టనుంది. ఆగస్ట్ 13 నుంచి 15వ తేదీ వరకు నివాసాలపై, వ్యాపార కేంద్రాలపై త్రివర్ణ పతాకం ఎగరవేయాలని ప్రజలకు బీజేపీ సూచించింది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని ఆ పార్టీ సీనియర్ నేత తరుణ్ చుగ్ పిలుపు నిచ్చారు. దేశవ్యాప్తంగా ప్రతి బూత్‌లో త్రివర్ణ పతాకం ఎగురవేయాలన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేతలు, మోర్చ బృందాలు, జిల్లా పార్టీ అధ్యక్షులు అంతా పాల్గొనాలన్నారు. ఆగస్ట్ 11 నుంచి ఆగస్ట్ 15వ తేదీ వరకు జరుగుతున్న ఈ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలని పార్టీ శ్రేణులకు తరుణ్ చుగ్ ఆదేశించారు. 2022 నుంచి దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా ప్రచారా కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుగుతుందని ఈ సందర్భంగా తరుణ్ చుగ్ గుర్తు చేశారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 11 ఆగస్టు 2024





## నా కోచింగ్ కెరీర్‌లో అదే ఘోర పరాభవం: ద్రవిడ్



టీమిండియా విజయవంతమైన కోచ్‌లలో ఒకడిగా గుర్తింపు పొందాడు మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్. టీ20 ప్రపంచకప్-2021 తర్వాత రవిశాస్త్రి స్థానంలో హెడ్‌కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఈ కర్ణాటక లెజెండ్ మార్గదర్శనంలో.. టీమిండియా అన్ని ఫార్మాట్లలో నంబర్ వన్‌గా ఎదిగింది. ద్వైపాక్షిక సిరీస్‌లలో వరుస విజయాలతో విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. అయితే, టీ20 ప్రపంచకప్-2022(సెమీస్), ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్- 2021-23, వన్డే వరల్డ్‌కప్-2023(ఫైనల్) టోర్నీలో మాత్రం టైటిల్ గెలవలేకపోయింది. ఈ క్రమంలో ఒక సందర్భంలో ద్రవిడ్‌ను వెంటనే కోచ్‌గా తొలగించాలనే డిమాండ్లూ వచ్చాయి. అయితే, బీసీసీఐ మాత్రం అతడిపై నమ్మకం ఉంచింది. వరల్డ్‌కప్-2023 తర్వాత అతడి పదవీకాలం ముగిసినా.. టీ20 ప్రపంచకప్-2024 వరకు కోచ్‌గా కొనసాగాలని కోరింది. ఇందుకు అంగీకరించిన ద్రవిడ్‌కు ఘనమైన వీడ్కోలు లభించింది. ప్రపంచకప్-2024లో రోహిత్ శర్మ కెప్టెన్సీలోని భారత జట్టు చాంపియన్‌గా అవతరించింది. తద్వారా దాదాపు పదకొండేళ్ల విరామం తర్వాత మరోసారి భారత్‌కు ఐసీసీ టైటిల్ దక్కింది. అయితే, సొంతగడ్డపై వన్డే వరల్డ్‌కప్ ఓడిపోవడం మాత్రం ద్రవిడ్ కెరీర్‌లోని చేదు అనుభవం అని చెప్పవచ్చు. అయితే, రాహుల్ ద్రవిడ్ మాత్రం అన్నింటికంటే సౌతాఫ్రికా గడ్డ మీద ఓటమే.. తన కోచింగ్ కెరీర్‌లో ఎదురైన ఘోర పరాభవం అంటున్నాడు. ప్రొటిస్ జట్టును తమ సొంతదేశంలో ఓడించే అవకాశం చేజారడం ఎన్నటికీ మర్చిపోలేనన్నాడు. చిరస్మరణీయ విజయం సాధించే క్రమంలో జరిగిన పొరపాట్ల వల్ల భారీ మూల్యమే చెల్లించామని పేర్కొన్నాడు. ఈ మేరకు.. "నా క్రికెట్ కోచింగ్ కోరీర్‌లో అన్నింటికంటే ఘోర పరాభవం.. సౌతాఫ్రికా గడ్డపై టెస్టు సిరీస్ గెలవలేకపోవడం. సెంచూరియన్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో మేము విజయం సాధించాం. అదే జోరులో రెండో టెస్టును ఘనంగా ఆరంభించాం. కానీ సౌతాఫ్రికా అనూహ్య రీతిలో తిరిగి పుంజుకుని గెలుపును లాగేసుకుంది. మూడో టెస్టులోనూ అదే ఫలితం పునరావృతం చేసింది. మా జట్టులోని కొందరు సీనియర్లు అప్పుడు అందుబాటులో లేరు. రోహిత్ శర్మ కూడా గాయపడ్డాడు. అయినా.. రెండు, మూడో టెస్టుల్లో విజయానికి చేరువగా వచ్చాం. కానీ లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం. అయితే, ఈ సిరీస్ ద్వారా ఎన్నో పాఠాలు నేర్చుకున్నాం. కోచ్‌గా ఎలా నన్ను నేను సంభాళించుకోవాలో తెలుసుకున్నా. అన్ని మ్యాచ్‌లు మనమే గెలవలేం. ఒక్కోసారి ఓటమే మనకు ఎంతో నేర్పిస్తుంది" అని రాహుల్ ద్రవిడ్ 2021-22 సిరీస్ నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నాడు. స్టార్ స్పోర్ట్స్ షోలో ఈ వ్యాఖ్యలు చేశాడు. కాగా ద్రవిడ్ స్థానంలో టీమిండియా హెడ్‌కోచ్‌గా గౌతం గంభీర్ బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇక గౌతీ హయాంలో తొలిసారిగా శ్రీలంక పర్యటనకు వెళ్లిన టీమిండియా టీ20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అయితే, వన్డే సిరీస్‌లో మాత్రం 0-2తో ఆతిథ్య లంక జట్టు చేతిలో ఓటమిని చవిచూసింది. 27 ఏళ్ల తర్వాత తొలిసారి శ్రీలంకకు వన్డే సిరీస్‌ను సమర్పించుకుంది.

## వినేశ్ ఫొగాట్ సిల్వర్ మెడల్ పై ముగిసిన వాదనలు

పారిస్: విశ్వ క్రీడల్లో భారత్కు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించిన అంశం వినేష్ ఫొగాట్ డిస్ క్వాలిఫికేషన్. పారిస్ ఒలింపిక్స్ లో పతకం సాధించి రిటైర్మెంట్ ప్రకటించాలని భావించిన భారత స్టార్ రెజ్లర్ వినేష్ ఫొగాట్ 100 గ్రాముల బరువు అధికంగా ఉన్న కారణంగా ఆమెను ఫైనల్ ఆడనివ్వలేదు. అయితే జరిగిన అన్యాయంపై వినేష్ ఫొగాట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (%జూూా%)కు అప్పీల్ చేసుకోవడం తెలిసిందే. సీఏఎస్ లో భారత రెజ్లర్ వినేష్ ఫొగాట్ తరఫున వాదనలు ముగిశాయి. వినేష్ అప్పీల్ స్వీకరించిన సీఏఎస్ శనివారం రాత్రి పారిస్ కాలమానం ప్రకారం సాయంత్రం 6 గంటలలోపు తుది తీర్పు వెల్లడించనుంది. భారత కాలమానం ప్రకారం శనివా రం రాత్రి 9:30 గంటలకు వినేష్ ఫొగాట్ సిల్వర్ మెడల్ పై తుది నిర్ణయం వెల్లడించనున్నారు. వినేశ్ ఫొగాట్పై ఒలింపిక్స్ ఫైనల్ ఆడకుండా అనర్హతా వేటు వేయడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ నిబంధనలతో ఒలింపిక్ కమిటీ తీసుకన్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ని వినేష్ ఫొగాట్ ఆశ్రయించారు. ఈ కేసులో ఇండియన్ ఒలింపిక్స్ అసోసియేషన్ తరఫున సీనియర్ లాయర్ హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. ఒకప్పుడు సొలిసిటర్ జనరల్గా సేవలు అందించిన సుదీర్ఘ అనుభవం హరీశ్ సాల్వే సొంతం. దీనిపై కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ లో విచారణ జరిగింది. ఇరువైపులా వాదనలు ము-ంగిశాయి. తాను నిబంధనల ప్రకారం సెమీఫైనల్ సైతం నెగ్గి ఫైనల్లోకి ప్రవేశించింది. కనుక ఆ విషయాన్ని పరిగణించి తనకు సిల్వర్ మెడల్ రావాలని వినేష్ ఫొగాట్ కోరారు. శక్తివంచన లేకుండా భారత్ కు స్వర్ణం అందించాలని యత్నించిన వినేశ్ ఫోగాట్ ను ఫైనల్ నుంచి డిస్ క్వాలిఫై చేయడంతో ఈ నిర్ణయాన్ని జీర్ణించుకోలేక రెజ్లింగ్ నుంచి తప్పుకున్నారు. అమ్మా రెజ్లింగ్ గెలిచింది, నేను ఓడిపోయాను. పతకం తేలేకపోయాను. నన్ను క్షమించు అంటూ భావోద్వేగంతో రెజ్లింగ్ కు రిటైర్మెంట్ ప్రకటించారు.

# 10 గంటలు 4.6 కిలోలు

## 'ఆపరేషన్ వెయిట్ లాస్' పతక పోరుకు ముందు బరువు తగ్గిన అమన్



పారిస్: కేవలం 100 గ్రాముల బరువు అదనంగా ఉండడంతో వినేశ్ ఫొగట్ పతకం కోల్పోయింది. దాంతో ఆమెతోపాటు యావత్ దేశం తీవ్ర ఆవేదనలో కూరుకుపోయింది. ఈనేపథ్యంలో మరో భారత రెజ్లర్‌కు అలాంటి దుస్థితి ఎదురుకాకుండా యాజమాన్యం చర్యలు తీసుకుంది. ఈక్రమంలో అమన్ సెహ్రావత్ విషయంలో అత్యంత జాగరూకతతో వ్యవహరించింది. పురుషుల 57 కిలోల విభాగంలో రీ హిగుచీ (జపాన్)తో సెమీఫైనల్లో అమన్ ఓడిపోయిన విషయం తెలిసిందే. గురువారం జరిగిన ఈ బౌట్ అనంతరం సాయంత్రం 6.30 సమయానికి సెహ్రావత్ 61 కిలోల 5 గ్రాముల బరువున్నాడు. దాంతో శుక్రవారం జరిగే కాంస్య పతక పోరు సమయానికి.. అమన్ 10 గంటల్లో 4 కిలోల 5 గ్రాముల బరువు తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతే..ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా కోచ్‌లు జగ్‌మందర్ సింగ్, వీరేందర్ దహియా 'ఆపరేషన్ వెయిట్ లాస్' మిషన్ చేపట్టారు.

%అది ఫలించి రెండోరోజు బరువు తూచే సమయానికి సెహ్రావత్ ఏకంగా 4.6 కిలోలు తగ్గి 56.9 కిలోలకు చేరడంతో మొత్తం భారత బృందం ఊపిరి పీల్చుకుంది. ఇక..బరువు తగ్గేందుకు అమన్ ఎలా శ్రమించాడంటే.. కోచ్‌ల సూచన మేరకు తొలుత గంటన్నరపాటు మ్యాట్‌పై కసరత్తులు చేశాడు. ప్రత్యర్థితో తలపడేటప్పుడు తీసుకొనే పొజిషన్లను ఇందులో ప్రాక్టీస్ చేశాడు. తర్వాత గంటపాటు వేడినీటితో స్నానం చేశాడు. అనంతరం జిమ్‌లో 60 నిమిషాలు నిరంతరాయంగా ట్రెడ్‌మిల్ చేశాడు. ఆపై 30 నిమిషాలు అమన్‌కు కోచ్‌లు విశ్రాంతి ఇచ్చారు. తర్వాత..సెషన్‌కు ఐదు నిమిషాల చొప్పున ఐదు సెషన్లపాటు ఆవిరి స్నానం చేయించారు. చివరి ఆవిరి సెషన్ తర్వాత అమన్ బరువు తూస్తే 900 గ్రాములు ఎక్కువగా ఉన్నాడు. దాంతో అతడికి మసాజ్ చేయడంతోపాటు తేలికపాటి జాగింగ్ చేయించారు. అనంతరం సెషన్‌కు 15 నిమిషాల చొప్పున ఐదు సెషన్లు రన్నింగ్ చేయించారు. ఉదయం 4.30కల్లా సెహ్రావత్ బరువు 56.9 కిలోలకు దిగొచ్చింది. అంటే నిర్దేశిత 57 కిలోలకంటే 100 గ్రాములు తక్కువన్నమాట. అప్పటికి కానీ భారత బృందం స్థిమితపడలేదు. ఇన్ని కసరత్తుల నడుమ సెహ్రావత్‌కు గోరు వెచ్చటి నీటిలో నిమ్మరసం, తేనె కలిపి ఇచ్చారు. అలాగే కొద్దిగా కాఫీ తాగించారు. గురువారం రాత్రంతా అతడు నిద్రపోలేదు. 'అతడి బరువును ప్రతి గంటకూ పరిశీలించాం. ఆ రాత్రేకాదు శుక్రవారం ఉదయం కూడా అమన్ నిద్రపోలేదు' అని కోచ్ దహియా వెల్లడించాడు. 'బరువు తగ్గించడం సాధారణంగా జరిగే ప్రక్రియ. మాకిది అలవాటే. కానీ వినేశ్ ఘటన నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి లోన య్యాం' అని దహియా తెలిపాడు. మొత్తంగా తాను, కోచ్‌లు పడిన కష్టాన్ని ప్రతిఫలిస్తూ అమన్ కాంస్య పతకంతో అదరగొట్టాడు.

## క్వార్టర్ ఫైనల్‌లో రితికా ఓటమి..



పారిస్ 2024 ఒలింపిక్స్‌లో మహిళల 76 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ ఈవెంట్‌లో శనివారం జరిగిన క్వార్టర్‌ఫైనల్‌లో రీతికా హుడా ఓటమి పాలైంది. 1-1తో కిర్గిస్థాన్‌కు చెందిన టాప్-సీడ్ ఐపెరి మెడెట్ కైజీ చేతిలో ఓడిపోయింది. కైజీ ఫైనల్‌కు చేరితే.. రిపీచేజ్ రౌండ్‌లో రీతికా కాంస్య పతకాన్ని సాధించే అవకాశం ఉంది. అంతకుముందు రీతికా 12-2 టెక్నికల్ ఆధిక్యతతో హంగరీకి చెందిన బెర్నాడెట్ నాగిపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ చేరింది. ఈ క్రమంలో.. ఓటమి పాలవ్వడంతో కాంస్య పతకం పైనే ఆశలు ఉన్నాయి.క్వార్టర్ ఫైనల్‌లో కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన ఐపెరి మెటెట్‌తో మొదట డ్రా అయింది. ఆ తర్వాత రితికా చివరి పాయింట్‌ను కోల్పోయింది. ప్రారంభంలో ఒక పాయింట్ ఆధిక్యాన్ని పొందగలిగిన రితికా.. రెండో భాగంలో గట్టిపోటీ ఇచ్చింది. మ్యాచ్‌కి చివరి పాయింట్‌గా రుజువైన 'పాసివిటీ (ఓవర్ డిఫెన్సివ్ యాటిట్యూడ్)' కారణంగా రితికా పాయింట్ కోల్పోయింది. 21 ఏళ్ల రితికా మొదటిసారి ఒలింపిక్స్?లో ఆడుతుంది. ఈ వెయిట్ కేటగిరీలో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన భారత దేశానికి చెందిన తొలి రెజ్లర్‌గా రితిక రికార్డులకెక్కింది. కాగా.. ఈ ఒలింపిక్స్‌లో రెజ్లింగ్ నిబంధనలు భారత్ స్వర్ణ పతక ఆశలకు పెద్ద దెబ్బ తీశాయి. రితికా కంటే ముందు వినేష్ ఫోగట్ కూడా పతకం సాధించలేకపోయింది. ఆమె బరువు కేవలం 100 గ్రాములు ఎక్కువ ఉన్న కారణం వల్ల ఫైనల్ ఆడలేకపోయింది. నిబంధనల ఆధారంగా ఆమెను అనర్హులుగా ప్రకటించారు. రితికా రోహ్‌తక్‌లోని ఖడ్కడ గ్రామంలో భారతీయ నావికాదళానికి చెందిన అధికారి. ఆమె ఇండియన్ నేవీలో అధికారి, చీఫ్ పీటీ ఆఫీసర్‌గా పనిచేసింది. 2022లో జరిగిన ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో 72 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఆ తరువాత.. టిరానాలో 2023లో జరిగిన అండర్-23 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. 2024లోనే ఆసియా ఛాంపియన్‌షిప్‌లో 72 కేజీల విభాగంలో రితికా కాంస్య పతకం సాధించింది.

## పారిస్ ఒలింపిక్స్ లో విషాదం

ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించాలనే ఓ రెజ్లర్ కల చెదిరింది. ప్రత్యర్థి అమాంతం ఎత్తి పడేయంతో ఊహించని విధంగా ఆమె గాయపడింది.

మహిళల ఫ్రీ స్టయిల్ 76 కిలోల విభాగం 16వ రౌండ్‌లో రొమేనియా రెజ్లర్ కటలినా అక్సెంటే ( తీవ్ర గాయాలపాలైంది. శనివారం ఉదయం జరిగిన బౌట్ సమయంలో అమెరికా రెజ్లర్ కెన్నెడీ బ్లేడ్స్ ఆమెను అమాంతం ఎత్తి మ్యాట్ మీద పడేసింది. దాంతో, కటలినా మెడకు తీవ్ర గాయ-ంమైంది. ఊహించని పరిణామంతో షాక్ తిన్న ఆమెను ఒలింపిక్స్ సిబ్బంది స్ట్రెచర్ మీద తరలించి అత్యవసర వైద్యం అందించారు. యూరో చాంపియన్‌షిప్స్‌లో రెండుసార్లు కాంస్యం నెగ్గిన అక్సెంటే, అమెరికా కెరటం కెన్నెడీకి గట్టి పోటీనిచ్చింది. అయితే.. మొదటి రౌండ్‌లో 6-0తో ఆధిక్యం సాధించిన అమెరికా రెజ్లర్ ఆ తర్వాత రెచ్చిపోయింది. అక్సెంటీని వెనకనుంచి అదిమి పట్టుకొని అలానే వెనక్కి ఎత్తి కింద పడేసింది.దాంతో, అక్కడున్నవాళ్లంతా ఒకింత షాక్‌కు గురయ్యారు. మెడకు గాయంతో బాధపడుతున్న అక్సెంటీని ఒలింపిక్స్ సిబ్బంది స్ట్రెచర్ మీద తీసుకెళ్లి వైద్యం అందించారు. అయితే.. ఆమె ఆరోగ్యం ఎలా ఉంది? అనేది ఇంకా తెలియలేదు.

## ఢిల్లీ ఎయిర్ పోర్టులో భారత హాకీ జట్టుకు ఘన స్వాగతం




పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్న భారత పురుషుల హాకీ జట్టు శనివారం స్వదేశానికి తిరిగి వచ్చింది. ఢిల్లీ విమానాశ్రయంలో భారత ఆటగాళ్లకు డప్పు వాయిద్యాలతో, పూల మాలలు వేసి ఘన స్వాగతం పలికారు. వేసి ఉదయం నుంచి భారత ఆటగాళ్ల కోసం విమానాశ్రయం లోపల అభిమానులు భారీ సంఖ్యలు వేచి ఉన్నారు. ఆటగాళ్లు ఎయిర్ పోర్ట్ నుంచి బయటకు భారత ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. ఇదిలా ఉంటే.. పారిస్ ఒలింపిక్స్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత భారత హాకీ జట్టు ఆటగాళ్లు ఢిల్లీ విమానాశ్రయం వెలుపల సంబరాలు చేసుకున్నారు. డప్పు చప్పుళ్లకు అనుగుణంగా స్టెప్పులు వేస్తూ సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా హాకీ ఇండియా జనరల్ సెక్రటరీ భోళనాథ్ సింగ్ మాట్లాడుతూ.. పారిస్ ఒలింపిక్స్ ముగింపు కార్యక్రమంలో జెండా బేరర్‌గా పీఆర్ శ్రీజేష్ ఎంపిక కావడం గురించి మాట్లాడారు. పిఆర్ శ్రీజేష్ ఒలింపిక్స్ ముగింపు కార్యక్రమంలో పతాకధారిగా అర్హుడని తెలిపారు. భారత ప్రభుత్వం, భారత ఒలింపిక్ కమిటీ అతనికి ఈ అవకాశాన్ని కల్పించినందుకు హాకీ ఇండియా తరుపున ధన్యవాదాలు తెలిపారు. వరుసగా రెండు పతకాలు సాధించడం ఒక గొప్ప విజయం అని అన్నారు. తమ లక్ష్యం ఫైనల్ ఆడటం, కానీ అమిత్ రోహిదాస్‌ను సిట్ అవుట్ చేయడంలో రిఫరీ చేసిన పొరపాటు కారణంగా తాము ఓడిపోయామన్నారు. అందుకే తాము కాంస్య పతకంతో ఇక్కడకు వచ్చాము. లేకుంటే పతకం రంగు మారి ఉండేదని పేర్కొన్నారు. టోక్యో ఒలింపిక్స్ 2020లో భారత హాకీ జట్టు పతకాన్ని సాధించిన సంగతి తెలిసిందే.. మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. పారిస్‌లో కూడా భారత్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. కాంస్య పతక పోరులో భారత్ 2-1తో స్పెయిన్‌ను ఓడించింది. అంతకుముందు సెమీస్‌లో జర్మనీ చేతిలో భారత్ 3-2 తేడాతో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. 1980లో మాస్కో ఒలింపిక్స్ తర్వాత హాకీలో భారత్ స్వర్ణం సాధించలేదు. హాకీలో భారత్ ఇప్పటి వరకు ఎనిమిది స్వర్ణాలు, ఒక రజతం, నాలుగు కాంస్య పతకాలతో మొత్తం 13 పతకాలు సాధించింది. భారత పురుషుల హాకీ జట్టు 52 ఏళ్ల తర్వాత వరుసగా రెండు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించింది. ఇంతకు ముందు 1968, 1972లో పతకాలు సాధించింది.



# అనసూయ మేడం స్టన్నింగ్ లుక్ వైరల్

జబర్దస్త్ షో తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ అనసూయ భరద్వాజ్. యాంగర్ గా మంచి ఫామ్ లో ఉన్న సమయంలోనే రెండో కొడుక్కు జన్మనిచ్చిన ఈ అమ్మడు ఆ తర్వాత కెరీర్ లో కాస్త తగ్గే అవకాశం ఉందని కొందరు అనుకున్నారు. కానీ పిల్లలు పుట్టడం అనేది గ్లామర్ ప్రపంచంలో అడ్డు కాదు అన్నట్లుగా ఈ అమ్మడు భావించింది. ఇద్దరి పిల్లలు పెద్ద వారు అవుతున్నా కూడా తన కెరీర్ లో ఎలాంటి మార్పు లేకుండా ముందుకు సాగుతూ వచ్చింది. తాజాగా ఈ అమ్మడు సినిమాలతో చాలా బిజీ అయిన విషయం తెల్సిందే. అనసూయ అందం విషయంలో హీరోయిన్స్ కి పోటీ అనడంలో ఎలాంటి సందేహం లేదు. లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేసేంత ప్రతిభ మరియు అందం ఆమె సొంతం. అయితే నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు చేస్తూ, అప్పుడప్పుడు లేడీ ఓరియంటెడ్ సినిమాలతో మెప్పించే ప్రయత్నాలు చేస్తుంది. ఆకట్టుకునే అందం తో రెగ్యులర్ గా సోషల్ మీడియాలో సందడి చేసే అనసూయ మరోసారి తన అందాల ఫోటోలతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అనసూయ ఫోటో షూట్ పిక్స్ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షించడంతో పాటు వావ్ అంటూ నోరు వెళ్లబెడుతున్నారు.

సన్నగా, నాజూకుగా ఉంటూ అందరి దృష్టిని ఆకర్షించే అనసూయ తాజాగా ఈ ఫోటోలను షేర్ చేసింది. ఊంచి వాలీ హీల్ పెహెన్ కర్ అంటూ ఫోటోలతో కామెంట్ పెట్టింది. విభిన్నమైన ఔట్ ఫిట్ తో రెగ్యులర్ గా వార్తల్లో ఉంటున్న అనసూయ మేడం ని ఇలా మరింత అందంగా చూడటం బాగుంది అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. ఈ స్థాయిలో అందంగా ఉన్న అనసూయ ఇతర భాషల్లో ప్రయత్నిస్తే కచ్చితంగా యంగ్ హీరోలకు హీరోయిన్ గా నటించే అవకాశాలు కూడా దక్కవచ్చు అనే అభిప్రాయం ను కొందరు ఫ్యాన్స్ మరియు నెటిజన్స్ వ్యక్తం చేస్తున్నారు. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన రంగస్థలం సినిమాలో రంగమ్మత్త పాత్రలో నటించి మెప్పించిన అనసూయ ఆ తర్వాత చేసిన ప్రతి సినిమాతో మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. అంతే కాకుండా పుష్ప సినిమాలో ఈమె పోషించిన పాత్రకు ప్రతి ఒక్కరు వావ్ అన్నారు. ప్రస్తుతం అందరి దృష్టి కూడా పుష్ప 2 పై ఉంది. మొదటి పార్ట్ తో పోల్చితే రెండో పార్ట్ లో ఈమె మరింత ప్రాముఖ్యత ఉన్న పాత్రలో కనిపించే అవకాశాలు ఉన్నాయి అంటూ ఆమె సన్నిహితులు మరియు ఇండస్ట్రీ వర్గాల వారు భావిస్తున్నారు. పుష్ప 2 కంటే ముందు పలు చిత్రాలతో అనసూయ ప్రేక్షకుల ముందుకు వస్తూనే ఉంది.

# గ్లామర్ డోస్ పెంచిన ఐశ్వర్య

దక్షిణ భారత చిత్రపరిశ్రమలో ప్రతి ఒక్కరికీ బాగా పరిచయమున్న హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ .కెరీర్ ఆరంభంలో హోమ్లీ గర్ల్‌గా ముద్ర వేసుకున్న ఈమె.. ఇపుడు గ్లామర్ డోస్ పెంచి ప్రతి ఒక్కరినీ ఆశ్చపరుస్తున్నారు. పా. రంజిత్ దర్శకత్వంలో 2011లో వచ్చిన 'అట్టకత్తి' సినిమాలో ఒక మంచి పాత్ర ద్వారా ఐశ్వర్య రాజేష్ వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'పుత్తగం' సినిమాలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. 'రమ్మి,' సినిమాలో విజయ్ సేతుపతి సరసన నటించారు. అయితే, 'కాక్కాము÷-టటై' సినిమా ఆమె సినీ కెరీర్‌కు ఓ టర్నింగ్ పాయింట్‌లా నిలిచింది. ఫలితంగా కోలీవుడ్ సరిహద్దులను దాటి తెలుగు, మలయాళ భాషల్లో కూడా వరుస అవకాశాలను సొంతం చేసుకుంటున్నారు. మధ్య లేడీ ఓరియంటెడ్ పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. 'ఫర్హానా'లో ఆమె ఒక ముస్లిం గృహిణిగా, ఇద్దరు పిల్లల తల్లిగా పోషించిన పాత్రకు ప్రశంసలు వచ్చాయి. సినిమాలే కాకుండా ఐశ్వర్య రాజేష్ సోషల్ మీడియాలో సైతం ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. ఎప్పటికప్పుడు తన తాజా ఫొటోషూట్ ఫొటోలను షేర్ చేస్తూ ఉంటారు. అయితే ఎప్పుడూ కూడా లిమిట్ దాటింది లేదు. కానీ ఇటీవలికాలంలో ఆమెలో చాలా మార్పు కనిపిస్తోంది. ఈ మధ్య ఆమె స్పెషల్ ఫొటో షూట్‌ల పేరుతో ఎక్స్‌పోజ్ చేస్తూ, సోషల్ మీడియాలో ఫొటోలను షేర్ చేస్తున్నారు. దీంతో సినీ ప్రేక్షకులే కాదు ఆమె ఫ్యాన్స్ సైతం ఆశ్చర్యపోతున్నారు. ఎందుకంటే, ఇప్పటి వరకు ఆమె హోమ్లీ గర్ల్ గానే కనిపించింది. ప్రేక్షకులు కూడా ఆమెను అలాగే ఇష్టపడుతూ వచ్చారు. కానీ, ఒక్కసారిగా ఇలా గ్లామర్ టచ్ ఇవ్వడంతో ఆమె ఫ్యాన్సే కాదు, నెటిజన్లు కూడా ఆశ్చర్యపోతున్నారు. మరి కాంపిటేషన్‌లో తనూ ఉండాలని అనుకుంటుందో, లేదంటే గ్లామర్ టచ్ ఇవ్వకుంటే అవకాశాలు రావని అనుకుంటుందో తెలియదు కానీ.. తను కూడా ఎక్స్‌పోజింగ్‌కు రెడీ అన్నట్లుగా సిగ్నల్స్ పంపుతుంది. తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు ఆ విషయాన్ని చెప్పకనే చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. హోమ్లీని పక్కనెట్టి గ్లామర్‌ని నమ్ముకుంటున్న ఈ భామకు ముందు ముందు ఎలాంటి అవకాశాలు వరిస్తాయో చూడాలి.





# చీరకట్టులో దేవియాని.. ఎంత అందంగా ఉందో..

సోషల్ మీడియా ఓపెన్ చేస్తే నార్త్ ఇండియన్ బ్యూటీస్ సందడి ఫుల్ గా ఉంటుంది. రెగ్యులర్ గా అందాల భామలు ఇన్ స్టాగ్రామ్ లో గ్లామరస్ ఫోటోషూట్ లతో తమ ఫ్యాన్స్ కి కావాల్సినంత నేత్రానందం అందిస్తూ ఉంటారు. దర్శక, నిర్మాతలు కూడా తమ సినిమాలకి కావాల్సిన హీరోయిన్స్ ని ఇన్ స్టాగ్రామ్ ప్రొఫైల్స్ చూసి ఎంపిక చేసుకుంటారనే టాక్ ఉంది. ఇన్ స్టాగ్రామ్ ద్వారా పాపులర్ అయ్యి తరువాత వెండితెరపై అవకాశాలు సొంతం చేసుకున్న భామలు చాలా మంది ఉన్నారు.

మోడలింగ్ ని కెరియర్ గా ఎంచుకున్న బ్యూటీస్ అందరికి కూడా ఇప్పుడు ఇన్ స్టాగ్రామ్ కేరాఫ్ గా మారింది. ఇదిలా ఉంటే తెలుగులో సైతాన్, సేవ్ ది టైగెర్స్ వెబ్ సిరీస్ లతో గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ దేవియాని శర్మ. ఈ బ్యూటీ అనగనగా అనే సిరీస్ తో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. తరువాత నవీన్ చంద్ర భానుమతి రామకృష్ణ సినిమాలో కీలక పాత్రలో నటించింది.

అయితే మహి వి రాఘవ దర్శకత్వంలో వచ్చిన క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ సైతాన్ దేవయానికి నటిగా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. సేవ్ ది టైగెర్స్ సిరీస్ లో చైతన్య కృష్ణ వైఫ్ క్యారెక్టర్ లో దేవయాని శర్మ నటించింది. ఈ సిరీస్ రెండు సీజన్స్ కి మంచి స్పందన వచ్చింది. మహి వి రాఘవ దర్శకత్వంలోనే ఈ సిరీస్ తెరకెక్కింది. రీసెంట్ గా అంజలి లీడ్ రోల్ లో తెరకెక్కిన ఝాన్సీ వెబ్ సిరీస్ లో కూడా దేవయాని శర్మ కీలక పాత్రలో నటించింది.

ఓ వైపు వెబ్ సిరీస్ లు నటిస్తూనే దేవయాని సినిమా ప్రయత్నాలు కూడా చేస్తోంది. ఇన్ స్టాగ్రామ్ లో ఈ బ్యూటీ చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన గ్లామర్ ఫోటోలని షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా చీరకట్టులో సంపంగి లాంటి అందంతో మెరిసిపోతున్న ఫోటోలని దేవయాని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ఈ ఫోటోలకి నెటిజన్లు నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. హెయిర్ లూజ్ గా వదిలేసి వయ్యారంగా చీర కొంగుని నడుముకి పెడుతూ తీసుకున్న ఈ స్టిల్స్ చాలా అందంగా ఉన్నాయనే మాట వినిపిస్తోంది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri
pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986